ప్రజాశక్తి

సోమవారం 5 ఫిబ్రవరి 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

పాడి రైతులకేదీ భరోసా?

- వైఎస్ఆర్ పశు బీమా ప్రీమియం చెల్లింపుల్లో జాప్యం
- 1502 మంది పశుపోషకులకు రూ.4.53 కోట్ల బకాయిలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

పశుపోషకులను ఆదుకుంటామని ప్రభుత్వం చెబుతున్న మాటలకు చేతలకు పొంతన లేకుండా పోయింది. పాడి పశువులు చనిపోయి కష్టాల్లో ఉన్న పశు పోషకులను ఆదుకోవడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. తాజాగా ప్రభుత్వం తీసుకువచ్చిన వైఎస్సార్ పశు బీమా పథకం ప్రీమియంలు చెల్లింపులు లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగడం లేదు. ఆచరణలో నామమాత్రంగా ముందుకు సాగుతోంది.

కృష్ణాజిల్లాలో రైతులతో పాటు పశుపోషణే వృత్తిగా చేసుకుని వేలాది మంది జీవిస్తున్నారు. ఒక మేలు జాతి పాడి పశువును కొనడానికి రూ లక్ష, నెల రోజుల జీవానికి (మేక, గొర్రె) వేలు ఖర్చు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ఆనారోగ్య కారణాలతో పశువులు, జీవాలు చనిపోతే లక్షలు, వేలల్లో నష్టపోతున్నారు. అప్పుల పాలై కోలుకోలేని విధంగా నష్టపోతున్న కుటుంబాలను వైఎస్సార్ పశు నష్టపరిహారం ద్వారా ఆదుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం భరోసా ఇవ్వడంతో పశుపోషకులు కంపెనీలకు బీమా ప్రీమియంలు నిలిపివేశారు. అయితే చనియిన పశువులకు పరిహారాన్ని ప్రభుత్వం రెండేళ్ళుగా పశు పోషకులకు అందించకుండా నిలిపివేసింది. జిల్లాలో 1502 మంది పశుపోషకులకు రూ. 4.53 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రయివేటు బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో పాటు ప్రభుత్వ సాయం అందక వేలాది మంది పశుపోషకులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

నత్తనడకన వైఎస్సార్ పశుబీమా పథకం

కృష్ణాజిల్లాలో ఆవులు, ఎద్దులు 36 వేలు, గేదెలు 2.83 లక్షలు, గొర్రెలు 2.19 లక్షలు, మేకలు 53 వేలు ఉన్నాయి. తాజాగా ప్రభుత్వం వైఎస్సార్ పశు నష్టపరిహారం పథకాన్ని నిలిపివేసింది. దీని స్థానంలో వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది.

లబ్ధిదారులు ఈ బీమా ప్రీమియంలో అత్యధిక వాటాను ప్రభుత్వం మరికొంత వాటాను పశు పోషకులు చెల్లించాలి. దీనికి తోడు లక్షకుపైగా ఖరీదు చేసే పశువుకు అయినా అత్యల్పంగా రూ. 15 వేలు, అత్యధికంగా రూ.30 వేలు మాత్రమే బీమా ప్రీమియం చేసేందుకు అవకాశం కల్పించారు. దీంతో ఈ బీమాకు పశు పోషకులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రభుత్వం వాటాగా రూ.200 పశువులకు రూ.4 లక్షలు మాత్రమే బీమా చెల్లింపులు జరిగాయి. ఈ నేపథ్యంలో పశు నష్టపరిహార పథకాన్ని నిలిపివేయడం, బీమా పథకం ముందుకు సాగకపోవడంతో పశుపోషకులు నష్టపోకుండా ప్రభుత్వం ఊరటనివ్వడంలో విఫలమవుతోందనే ఆరోపణలు వినవస్తున్నాయి.

రసవత్తరంగా మైలవరం రాజకీయం

- టిడిపిలో చేరేందుకు కృష్ణప్రసాద్ రంగం సిద్ధం
- వ్యతిరేకిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమా

కృష్ణప్రసాద్



ఉమా

ప్రజాశక్తి-విజయవాడ ప్రతినిధి

ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది. వైసిపి విడుదల చేసిన ఆరో జాబితాలో సిట్టింగ్ ఎంఎల్ఎ వసంత కృష్ణప్రసాద్‌ను కాకుండా జడ్‌పిటిసి స్వర్నాల తిరుపతిరావు యాదవ్‌ను నియోజకవర్గ సమన్వరకర్తగా అధిష్టానం ఖరారు చేసింది. దీంతో కృష్ణప్రసాద్ తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌తో పాటు మరికొందరు టిక్కెట్ రాకుండా చక్రం తిప్పినట్లు ఎమ్మెల్యే అనుచరులు చర్చించుకుంటున్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రెండో మంత్రి వర్గ విస్తరణలో వసంత కృష్ణప్రసాద్ మంత్రి పదవి దక్కుతుందని ఆశించి భంగపడ్డారు. ఆ తర్వాత మంత్రి జోగి రమేష్‌కు, వసంత కృష్ణప్రసాద్‌కు తరచుగా ఆధిపత్య పోరు సాగింది. ఇది కాస్తా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు కూడా పోయింది. కృష్ణప్రసాద్ తండ్రి, మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు వైసిపి ప్రభుత్వానికి, సిఎం జగన్‌ను విమర్శిస్తూ వ్యాఖ్యలు చేయడం కూడా అప్పట్లో సంచలనంగా మారింది. వైసిపి మంత్రి వర్గంలో కమ్మ సామాజిక వర్గానికి స్థానం లేకుండా చేయడం, హెల్త్ యూనివర్శిటీకి ఎన్టీఆర్ పేరు మార్చడంపైనా ఆయన విమర్శలు దుమారం రేపాయి. దీనికి తోడు అడపాదడపా ప్రభుత్వంపై తన అసంతృప్తులు వ్యక్తం చేయడం వంటివి కృష్ణప్రసాద్‌కు టిక్కెట్ నిరాకరణకు కారణాలుగా మారి ఉండొచ్చని వైసిపి శ్రేణులు చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పార్టీ మారాలనే నిర్ణయానికి వచ్చినట్లు, టిడిపిలోకి వెళ్లనున్నట్లు ప్రచారం జరిగింది. తన వర్గం నాయకులు, కార్యకర్తలతో చర్చించి తన (మిగతా 6లో)

సభలో మాట్లాడుతున్న ఎంబివికె ట్రస్టు బాధ్యులు మురళీకృష్ణ

మహిళా చైతన్యానికి జ్యోతి కృషి

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

మహిళా చైతన్యానికి డాక్టర్ శిరివరపు జ్యోతి ఎనలేని కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. డాక్టర్ శిరివరపు జ్యోతి సంస్మరణ సభ ఉయ్యూరు మండలం కాటూరు గ్రామంలో ఆదివారం జరిగింది. ముందుగా జ్యోతి చిత్రపటానికి పలువురు సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం తదనంతరం కాలంలోనే నాగళ్ల రాజేశ్వరమ్మ, సూర్యావతి, మానికొండ సుబ్బారావు, గోపాలరావు తమ కుటుంబ ప్రయోజనాలకన్నా మహిళలు, ప్రజల ప్రయోజనాలు మిన్న అని నమ్మి కాటూరు, యలమర్రు పరిసర ప్రాంతాల్లో ప్రజల్లో నూతన చైతన్యాన్ని కలిగించారన్నారు. అదేబాటలో జ్యోతి పయనించి కాటూరు గ్రామంలో ప్రజలు, మహిళల్లో నూతన చైతన్యానికి పునాది వేశారన్నారు. మహిళలకు మరుగుదొడ్ల కోసం ఆందోళనలు నిర్వహించారని అన్నారు. ఎంబివికె ట్రస్టు బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ ఉయ్యూరులో తల్లిదండ్రుల పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసిన ఆమె ప్రజల (మిగతా 6లో)

జ్యోతి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

డ్వాక్రా గ్రూపులకు రూ.1181.49 కోట్ల రుణమాఫీ

- పొదుపు సంఘాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- కృష్ణాజిల్లా డిఆర్‌డిఎ పీడీ ప్రసాద్

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

డ్వాక్రా గ్రూపు మహిళలకు ఆసరా పథకంలో భాగంగా ఈ నెలలో రుణమాఫీ పూర్వతుందని కృష్ణాజిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వైఎస్సాఆర్ క్రాంతి పథం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పిఎస్ఆర్ ప్రసాద్ తెలిపారు. సంఘాల్లోని పేద మహిళలకు సున్నా వడ్డీ రుణాలు అందించడంతో పాటు పలు ప్రభుత్వ పథకాల ద్వారా గ్రూపుల్లోని మహిళలకు లబ్ధి చేకూర్చుతున్నట్లు తెలిపారు. డ్వాక్రా గ్రూపుల

రుణమాఫీ, సంక్షేమ పథకాలు గురించి 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రసాద్ పలు విషయాలు చెప్పారు.

ప్రశ్న: ఆసరా పథకంలో ఎందరికి లబ్ధి

చేకూరింది?

2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి పొదుపు సంఘాలు బ్యాంకుల్లో తీసుకున్న (మిగతా 6లో)

కృష్ణానదిలో ఈత పోటీలు

వార్త 6లో

విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

పనులు పర్యవేక్షిస్తున్న దృశ్యం

ఎన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధిని ఆపం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: టిడిపి కుయుక్తులను నియోజకవర్గ ప్రజలు గమనిస్తూనే ఉన్నారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా ఊర చెరువు సుందరీకరణ పనులను ఆదివారం ఉదయభాను పరిశీలించారు. సైడ్ గ్రిల్స్, వాకింగ్ ట్రాక్ తదితర పనుల గురించి కాంట్రాక్టర్లు అడిగి తెలుసుకున్నారు. పనుల విషయంలో రాజీ పడవద్దు అని నాణ్యత ప్రమాణాలు పాటించాలని చెప్పారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ అభివృద్ధి జరుగుతున్న టిడిపి వారు ఓర్చుకోలేక కోర్టుల్లో కేసులు వేస్తున్నారని అన్నారు. షాదీ ఖానా, ఊర చెరువు, రోడ్లు, చివరికి పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను కూడా అడ్డుకుంటూ కోర్టుల్లో కేసులు వేయడం దౌర్భాగ్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విస్సన్నపేట జడ్‌పిటిసికి పరామర్శ

ప్రజాశక్తి విస్సన్నపేట: విస్సన్నపేట జెడ్పిటిసి భీమిరెడ్డి లోకేశ్వర్‌రెడ్డికి ఇటీవల కాలు ఫ్రాక్చర్ కావడంతో హైదరాబాద్ అపోలో హాస్పిటల్‌లో మెరుగైన చికిత్స కోసం వెళ్లారు. ఆయన చికిత్స

లోకేశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న దృశ్యం

అనంతరం పుట్రేల గ్రామంలోని ఆయన నివాసానికి చేరుకోవడంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాస్, నాలుగు మండలాల నాయకులు వైసిపి ముఖ్య నేతలు భారీగా చేరుకుని లోకేశ్వర్ రెడ్డిని పరామర్శించి ఆయన ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు.

నిరుపేదలకు మంచి చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : నిరుపేదలకు మంచి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మండలంలోని, శనగపాడు గ్రామంలో కోటి రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం ప్రారంభం, డ్రైయిన్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కార్పొరేట్ శక్తులు, ఆయా పార్టీలకు చెందిన నాయకులకు, కార్యకర్తలకు మినహా పేద ప్రజలు చేసిందేమీ లేదన్నారు. నేడు మన జగనన్న సంక్షేమ పాలనలో గ్రామ వార్డు సచివాలయాల ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమాన్ని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

తాపీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - విస్సన్నపేట : తాపీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆదివారం ఎన్నికైంది. అధ్యక్షులుగా మద్రి బోయిన అప్పారావు ఏక గ్రీవంగా ఎన్ని కయ్యారు. స్థానిక భవన నిర్మాణ కార్మికుల మహాసభ బస్టాండ్ ఎదురుగా ఉన్న యూనియన్ ఆఫీసులో అధ్యక్షులు అప్పారావు, సిఐటియు మండల

తాపీ వర్కర్స్ నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు అధ్యక్షతన మహాసభ జరిగింది. ఈ మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలను మారుస్తూ కార్మికులకు ద్రోహం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేకల జ్ఞానరత్నం పాల్గొన్నారు. నూతన కమిటీ సెక్రెటరీగా పోతురాజు శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ పోతురాజు సత్యనారాయణ, ఆకుల శోభన్‌బాబు సహాయ కార్యదర్శిగా బి.శివ సుబ్బారావు ఎం.మంగపతిరావు కోశాధికారిగా, గౌరవ అధ్యక్షులుగా గంజినబోయిన రాము గౌరవ అధ్యక్షులుగా సగుర్తి శ్రీనివాసరావు, గంధం సుబ్బారావు, ఆకుల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులుగా రాజేష్ మురళీకృష్ణ ఎన్నికయ్యారు.

డప్పు కళాకారుల సంఘం నాయకులు వీరబాబు మృతి

ప్రజాశక్తి - వత్సవాయి : డప్పు కళాకారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు కరిసే వీరబాబు ఆదివారం మృతిచెందారు. మండలంలోని కన్నివేడుకు చెందిన వీరబాబు కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య రాంబాయి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న కన్నె వీడు గ్రామ సర్పంచి సేవా దుర్గారాణి శ్రీధర్ ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి మల్లవరపు కుటుంబరావు, మండల కార్యదర్శి గుడేటి ఆదాం, మండల కమిటీ సభ్యులు పులి దేవయ్య, రాయల సుదర్శనం ఆదిమల్ల సత్యం, కరిచే ఆనందరావు, తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి

కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'ఓట్ ఫర్ ఓపిఎస్' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : యుటిఎఫ్ రాష్ట్ర సంఘం రూపొందించిన 'ఓట్ ఫర్‌ఓపిఎస్' పోస్టర్‌ను ఆదివారం పట్టణంలోని టీచర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయం ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు ఎం.కష్ణయ్య, జిల్లా కార్యదర్శి జె.సుధానంద్, మండల శాఖ అధ్యక్షురాలు జి.పల్లవి, ప్రధాన కార్యదర్శి జి.ముక్తేశ్వరరావు, గౌరవాధ్యక్షులు జి.ప్రవీణ్ కుమార్ జిల్లా కౌన్సిల్ సభ్యులు అల్లిక నరసింహారావు, కోశాధికారి టి.ప్రసాద్ బాబు, మండల కార్యదర్శి కె.సాయి శ్రీనివాసరావు, వత్సవాయి మండల శాఖ ప్రధాన కార్యదర్శి పెసరమల్లి.వెంకటేశ్వర్లు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు ఎం.కష్ణయ్య మాట్లాడుతూ ఎవరైతే పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తామని హామీ ఇస్తారో వారికి మాత్రమే వచ్చే ఏప్రిల్‌లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మా ఉద్యోగుల ఓటు ఉంటుందని ఆయన తెలిపారు. ఇప్పటికే మన రాష్ట్రంలో వామపక్షాలు సిపిఎం, సిపిఐ పార్టీలు, పాత పెన్షన్ అమలుకు కట్టుబడి వున్నాయి.

ఓట్ ఫర్ ఓపిఎ స్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

అదే విధంగా కాంగ్రెస్ పార్టీ కూడా పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తామని చెప్పి హామీ ఇచ్చారు. ఇతర రాజకీయ పార్టీలు కూడా పాత పెన్షన్ విషయంలో వారి వైఖరిని స్పష్టం చేస్తూ మేనిఫెస్టోల్లో అమలు చేస్తామని హామీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓట్ ఫర్ ఓపిఎస్ నినాదాన్ని ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, ప్రజలకు, అన్ని రాజకీయ పార్టీల మండల, జిల్లా, రాష్ట్ర, నాయకుల దృష్టికి తీసుకెళ్లే పని చేస్తామని ఆయన తెలిపారు. రాజకీయ నాయకులు వారి వైఖరిని స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

దారెల్లి నాగేశ్వరరావు 36వ వర్ధంతి

ప్రజాశక్తి - వత్సవాయి : దారెల్లి నాగేశ్వరరావు మృతిచెందినా ప్రజల హృదయాల్లో స్థిర స్థాయిగా నిలిచి పోయారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చన మోలు సైదులు అన్నారు. మండలంలోని

నివాళులర్పిస్తున్న సైదులు, తదితరులు

పోలంపల్లి గ్రామంలో దారెల్లి నాగేశ్వరరావు 36వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సిపిఎం జెండాను చిన్నమోలు సైదులు ఆవిష్కరించారు. నాగేశ్వరరావు విగ్రహానికి సతీమణితో పాటు సిపిఎం నాయకులు సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమసమాజం కోసం ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లామని అన్నారు. నాగేశ్వరరావు అతి చిన్న వయసులోనే పేద ప్రజల కోసం, కార్మికుల కోసం, కూలీల కోసం ప్రాణాలర్పించారని అన్నారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తమ్మినేని రమేష్, సిపిఎం మండల కమిటీ సభ్యులు మండే పూడి చంద్రశేఖర్, తమ్మినేని రాంబాబులు మాట్లాడారు. పార్టీ జెండాలతో ప్రదర్శన చేపట్టారు. ఆటలు పాటలతో ర్యాలీ చేపట్టారు. పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంచర్ల కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

బైకు దొంగ అరెస్టు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ వాహనాలను దొంగతనం చేసిన వ్యక్తిని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ సిపి కాంతి రానా టాటా,

డిసిపి కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నందిగామ ఇన్‌ఛార్జి ఎసిపి బి.అర్.నాయుడు, జగ్గయ్యపేట సిఐ ఎం.జానకిరాం ఆధ్వర్యంలో చిల్లకల్లు ఎస్ఐ వారి సిబ్బంది వెంకట్, శివ నాగరాజు, అప్పారావు దొంగను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించారు. గుంటూరు జిల్లా మంగళగిరి కి చెందిన కటారి శ్యాం బాబును అరెస్టు చేసి అతని నుంచి సుమారు 3 లక్షల 50 వేల రూ విలువైన 7 వాహనాలను పట్టుకున్నారు. దొంగను చాకచక్యంగా పట్టుకోవడంలో చొరవ చూపిన ఎస్ఐ, సిబ్బంది రవి, వెంకట్, శివ నాగరాజు, అప్పారావులను ఉన్నతాధికారులు అభినందించారు. ప్రజలు చిల్లకల్లు పోలీస్ వారికి అభినందనలు తెలిపారు.

వ్యవసాయాభివృద్ధిపై సమీక్ష

పెనుగంచిప్రోలు : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సందర్శించి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కార్యకలాపాలు గురించి సంఘ కార్యదర్శి కొండలు శర్మ, అధ్యక్షుడు నరసింహారావు లు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ రవి శంకర్, సీనియర్ నేత రవి కుమార్, ఎంపిపి గాంధీ, జడ్పిటిసి నాగమణి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వాసు, శ్రీనివాసరావు, వెంకట నారాయణ, శ్రీనివాస్, నాగేశ్వరరావు, ధర్మ రెడ్డి, వెంకట్రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బోరు ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని గురుకుల పాఠశాల్లో బోరు ఏర్పాటు చేసేందుకు అధికారులు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ విప్ ఉదయభాను సందర్శన సమయంలో విద్యార్థులు పాఠశాలలో నీటి కొరత సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రకు ఆదేశించారు. ఆయన సూచన మేరకు వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, ప్రిన్సిపాల్ సుజాత శంకుస్థాపన చేశారు. మున్సిపల్ ఎఇ తహనుమంతరావు పాల్గొన్నారు.

రంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - అజిత్ సింగ్ నగర్ : న్యూ రాజీవ్ నగర్ కట్ట ఏరియాలో వడ్డేపల్లి సామ్రాజ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్ రంగా కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఎంఎల్ఎ వెలంపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు మోదు గుల తిరుపతమ్మ గణేష్, యర్రగొర్ల రాములు, తాడి శంకుతల, వరలక్ష్మి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - తిరువూరు : పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం తిరువూరు రాజుపేటలో మామిడి తోటలో జరిగింది. 35 (1987-1989) సంవత్సరాల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు ఒకరికొకరు క్షేమ సమాచారం తెలుసుకొని పాత జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ ఎరుబండి ఉమా నాగేశ్వరరావు, నదికుదిటి ఫనిష్, చిత్తలూరి సోమశేఖర్, పరసా నెహ్రూజీ, యంద్రాతి, కిరణ్ పాల్గొన్నారు.

మరుపిళ్ల చిట్టి సేవలు నిరుపమానం

విగ్రహావిష్కరణలో ఎంపి కేశినేని, ఎంఎల్ఎ వెలంపల్లి, జనసేన మహేష్

మరుపిళ్ల చిట్టి విగ్రహావిష్కరణ చేస్తున్న ఎంపి కేశినేని, ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ శాసనసభ్యులు, సర్దార్ మరుపిళ్ల చిట్టి కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం చిట్టినగర్ సెంటర్‌లో జరిగింది. సర్దార్ చిట్టి కాంస్య విగ్రహావిష్కరణలో ముఖ్య అతిథులుగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ పార్లమెంట్‌సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని), పశ్చిమ వైసీపీ ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్, ఆంధ్రప్రదేశ్ నగరాల సంఘం పూర్వ అధ్యక్షులు బాయన వెంకట్రావు, మరుపిళ్ల చిట్టి మనవరాలు మరుపిళ్ల ఉమా మోహనతిలక్, ఏపి నగరాల డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పిళ్లా సుజాత సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నగరాల సంఘం అధ్యక్షులు బాయన బాబూజీ, కార్యదర్శి పోతిన వెంకటేశ్వరస్వామి, జనసేన నగర అధ్యక్షులు పోతిన మహేష్, బిజెపి జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, పలువురు కార్పొరేటర్లు, నగరాల సామాజికవర్గ ప్రముఖులు తదితరులతో పాటుగా ఎంతోమంది ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా సర్దార్ మరుపిళ్ళ చిట్టి తన జీవితాంతం వరకూ పనిచేశారని కొనియాడారు. విజయవాడ నగరాభివృద్ధికి విశేషకృషిచేసిన చిట్టి జీవితం ఆదర్శప్రాయమని వారు కొనియాడారు. పాలఫ్యాక్టరీ కోసం తన సొంత 35 ఎకరాల భూమిని ఆయన విరాళంగా ఇచ్చారని కొనియాడారు. నగరపాలక సంస్థ కౌన్సిల్‌లో తీర్మానం చేసి సర్దార్ మరుపిళ్ల చిట్టి కాంస్య విగ్రహాన్ని చిట్టినగర్ సెంటర్‌లో ఏర్పాటుచేయడం అభినందనీయమని అన్నారు. కాగా జనసేన పోతిన మహేష్ భారీ ప్రదర్శనగా తరలివచ్చి చిట్టి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ నేపథ్యంలో స్టేజిపై అప్పటికే అధికార పార్టీ ఎమ్మెల్యే, మేయర్, ఎంపి ఉన్నారు. పోతిన మహేష్ తన పార్టీ శ్రేణులతో మరుపిళ్ళ చిట్టి విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికార పక్ష సభ్యులు మాట్లాడి వెళ్లిపోయిన అనంతరం పోతిన వెంకట మహేష్ తాను ప్రసంగం చేశారు. అయితే చిట్టి విగ్రహం ప్రారంభోత్సవానికి వచ్చిన అధికార పార్టీ ఎమ్మెల్యే, మేయర్ వైసిపి గురించి, సిఎం జగన్‌ను పొగుడుతూ ఎన్నికల సభలా మాట్లాడటంపై వచ్చిన వారు పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఈ సమయంలో అధికార పక్ష, ప్రతిపక్ష నసేన మహేష్ కార్యకర్తలతో ర్యాలీగా రావటంతో టూటౌన్ సిఐ గణేష్ తన సిబ్బందితో గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటుచేశారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి-చల్లపల్లి : కృష్ణా నది తీరంలోని లంక భూముల మధ్య ఇసుక ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తే సహించేది లేదని పరిసర ప్రాంత రైతులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.చల్లపల్లి మండల పరిధిలోని కృష్ణానది తీరంలో వెలివోలు, నిమ్మగడ్డ నడకుదురు లంక భూమల మధ్య నిబంధనలకు విరుద్ధముగా యథేచ్ఛగా విచ్చలవిడిగా ఇసుక తవ్వడం వలన భూగర్భ జలాలు అడుగంటిపోయి రాబోయే వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడి తాగునీరు, సాగునీరు కు ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమదారులు నదిలో జెసిబి తో ఎక్కడ పడితే అక్కడ లోతుగా ఇసుక తవ్వడంతో ఏర్పడిన గోతులలో నీరు చేరడంతో ప్రమాదాల జరుగుతున్నాయని విచారం వ్యక్తం చేస్తున్నారు. లంక భూము లలో మేతకు వెళుతున్న పశువులు గుంతలలో పడి మరణించిన సంఘటన కూడా ఉన్నాయని పరిసర ప్రాంత ప్రజలు తెలిపారు. విచ్చలవిడిగా నది మధ్యలో ఇసుక తోడటం వలన భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలకు నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి రేవులో ఉన్న 7 టిప్పర్ల ను రైతుల అడ్డుకొని వెనక్కు పంపారు. లోడ్ అయిన ఇసుకను రేవులోనే అన్ లోడ్ చేయించారు. పాగోలులో జగనన్న కాలనీకి మెరక కు ఇసుక తోలుతున్నామని చెబుతున్నారనీ... ప్రవేటు స్థలాలకు సైతం ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించటంతో అర్ధరాత్రి తవ్వకాలను అడ్డుకున్నట్లు రైతులు తెలిపారు. నడకుదురు, పురిటిగడ్డ, రాముడుపాలెం గ్రామాలకు చెందిన సుమారు 20మంది రైతులు, యువకులు ఇసుక తరలింపును అడ్డుకున్నారు. జేసీబీని సైతం తవ్వకం జరిగే పాయింట్ దగ్గర నుంచీ పంపించివేశారు. మళ్లీ తవ్వకాలు చేపడితే అడ్డుకుని తీరుతామని రైతులు స్పష్టం చేశారు.

నదిలో ఇసుకను తవ్వుతున్న జెసిబి

దిమ్మె కూల్చిన వారిపై ఫిర్యాదు

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో 11వ డివిజన్లో డివిజన్ ఇంచార్జ్,దళిత జేఏసీ నాయకులు బండి కరుణాకర్ ఏర్పాటు చేసిన జనసేన పార్టీ దిమ్మెను శనివారం రాత్రి దుండగులు కూల్చివేసి స్థూపాన్ని జెండాను తస్కరించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దుండగులపై చర్యలు తీసుకోవాలని జనసేన టిడిపి శ్రేణులు ఆదివారం మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. ఈ కార్యక్రమంలో బండి రామకృష్ణ, మోటమర్రి బాబా ప్రసాద్, కొట్టే వెంకట్రావు,పి వి ఫణి కుమార్,వంపుగొడవల చౌదరి, గడ్డం రాజు జనసేన,టిడిపి నాయకులు పాల్గొన్నారు.

భవనాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

సచివాలయం, ఆర్‌బికె కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గుడివాడ : నందివాడ మండలం తుమ్మలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రజా ప్రతినిధులతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కొడాలి నాని మాట్లాడుతూ రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు విద్యా, వైద్యం సంపూర్ణంగా అందించాలనే సంకల్పంతో సిఎం జగన్ తీసుకున్న చర్యలు ఎంతో విజయవంతమయ్యాయన్నారు. ఎవరెన్ని అవాంతరాలు సష్టించిన ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న నిబద్ధత కలిగిన నాయకుడు జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, సర్పంచ్ రాధాకష్ణ, గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ మట్టా నాగమణి, తుమ్మలపల్లి ఎంపిటిసీ వెన్నా ప్రభావతి, నాయకులు కొండపల్లి కుమార్‌రెడ్డి, చింతాడ నాగూర్, పాలేటి చంటి, గూడపాటి వెంకటేశ్వరరావు, దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ,కందుల నాగరాజు, అమతబాబు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలివెళ్లిన ఆర్‌ఎంపి వైద్యులు

ప్రజాశక్తి-గన్నవరం : ఆర్‌ఎంపీలను ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో జరిగే రాష్ట్ర మహాసభలకు గన్నవరం డివిజన్ నుంచి ఆర్‌ఎంపి వైద్యులు ఆదివారం తరలి వెళ్లారు. ఆర్‌ఎంపి వైద్యుల సమస్యల పరిష్కరించాలని, అర్హులైన వారికి గుర్తింపు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగస్వామ్యం కల్పించాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సంఘ నాయకులు విజయకుమార్, వెంకటేశ్వరరావు, డిమాండ్ చేశారు. డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా ఎంపికైన ఇద్దరికి సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల ఎస్సై ఉద్యోగాలలో ఉద్యోగం పొందిన ఇరువురు అభ్యర్థులు బెల్లంకొండ జయరాజు గోవాడ నవీన్‌లకు అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో సత్కారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి జే ప్రభుదాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోస్ట్మాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మందపాకల గ్రామానికి చెందిన బండి కోళ్ల జయరాజు, మోపిదేవి గ్రామానికి చెందిన జి నవీన్ సబ్‌ఇన్స్పెక్టర్ ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. ఈ విజయ సాధనలో వారి అనుభవాలను గత పరీక్షలలో వారు చేసిన తప్పిదాలను వాటిని సవరించుకున్న విధానాల గురించి ప్రస్తుత పరీక్షలకు సిద్ధమవుతున్న పద్ధతుల గురించి వివరించారు. వారి అనుభవాలను గుణపాటాలుగా నేర్చుకొని భవిష్యత్తులో పోటీ పరీక్షలకు సిద్ధమవ్వాలని అందుకు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామలింగేశ్వర రావు సూచించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకురాలు ఏ వీర కుమారి, గ్రంథాలయాది సిబ్బంది కపారావు, శ్రీదేవి పాఠకులు పాల్గొన్నారు.

అభ్యర్థులను సత్కరిస్తున్న పోస్ట్మాస్టర్ రామలింగేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది

ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న ప్రజలు

ముమ్మరంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌లు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఇళ్లస్థలా రిజిస్ట్రేషన్ ఆదివారం కూడా ముమ్మరంగా జరిగాయి. స్థానిక జగనన్న కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు వెయ్యకు పైగా ఇళ్లస్థలాలను సంవత్సరం క్రితం పంపిణీ చేసింది. ఆ పట్టాలకు రిజిస్ట్రేషన్ కార్యక్ర మాన్ని రెండు రోజుల క్రితం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నారు. ఆదివారం 80 మంది రిజిస్ట్రేషన్ నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి, జాయింట్ సబ్ రిజిస్టర్ గుడ్లవ ల్లేరు 1 ఏ జె ఎల్ నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్వోలు ప్రకాష్, గంగాధర రావు, డిజిటల్ అసిస్టెంట్ సుస్మిత, సిబ్బంది పాల్గొన్నారు.

యార్లగడ్డ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన ఓ యువతికి టీడీపీ గన్నవరం నియోజవర్గం ఇంచార్జ్ యార్లగడ్డ వెంకట్రావు ఆర్థిక సాయం అందించారు. బాపులపాడు మండలం బండారి గూడెం గ్రామానికి చెందిన పుల్లెల్లి రాజ్యలక్ష్మి చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి బంధువులు వద్ద వుంటుంది. రాజ్యలక్ష్మి కి వివాహం నిశ్చయం కావాడంతో ఖర్చుల నిమిత్తం పెళ్లి కానుక పేరుతో యార్లగడ్డ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం టిడిపి గ్రామ అధ్యక్షుడు కొండేటి నాగరాజు స్థానిక నాయకులతో కలిసి రాజ్యలక్ష్మి నివాసానికి వెళ్లి నూతన వధువును ఆశీర్వదించి యార్లగడ్డ పెళ్లి కానుక ఆర్థిక సాయం నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో నువ్వుల జయరాజు, టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడు రాజులపాటి నాగరాజు,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి: ఉప్పాల రాము

ప్రజాశక్తి-పెడన : రానున్న ఎన్నికలలో పెడన శాసనసభ అభ్యర్థిగా తనను గెలిపిస్తే ఈ జీవితం ప్రజలకు అంకితం చేస్తానని నియోజవర్గ ఇన్చార్జ్ ఉప్పల రాము అన్నారు. మండల పరిధిలోని నడుపూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు పెద్ద ఎత్తున హారతులు, పూలమాలతో స్వాగతం పలికారు. అనంతరం రాము మాట్లాడుతూ పేదలకు, పెత్తందారులకు జరిగే ఈ యుద్ధంలో జగన్మోహన్ రెడ్డి పేదలవైపు యుద్ధం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తే 20 సంవత్సరాల పాటు రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఆశ భావం వ్యక్తం చేశారు. గెలిచిన అనంతరం అధికారంలోకి రాగానే గ్రామాలకు సాగునీరు, తాగునీరు పూర్తి స్థాయిలో చేస్తానన్నారు. అంతేకాకుండా రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ వ్యవస్థాపన నుంచి అనేక విధాలుగా ప్రజలకు అందుబాటులో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దార్ సేవలు అభినందనీయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ తహసిల్దార్ ఎల్ వి ఎస్ రామకష్ణ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రశంసించారు. రామకష్ణ అవనిగడ్డ నుండి బదిలీపై వెళుతున్న సందర్భంగా ఆదివారం తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ కు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రామకృష్ణ సేవలను కొనియాడారు. కష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ఎం మరియాదేవి పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజలకు హాని చేసే నూతన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మచిలీపట్నం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో ఆదివారం న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు కళ్ళకు నల్ల రిబ్బన్లు కొట్టుకుని ప్లకార్డులతో నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, తుంగల హరిబాబు మాట్లాడుతూ అధికారం చేతిలో ఉంది కదా అని పాలకులు ప్రజలకు హాని చేసే నూతన భూ హక్కు చట్టాన్ని చేసి ప్రజల ఆస్తులను అధికార మదంతో న్యాయస్థానాల పరిధి తప్పించి లాక్కోవాలని చూడడం పాలకుల అధికార దాహానికి నిదర్శనం అన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజా వ్యతిరేక భూ హక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, లేదంటే వైసీపీ పాలకులకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. న్యాయవాదుల గుమస్తాల సంఘం ప్రధాన కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షాలను, మేధావులైన న్యాయ నిపుణులను సంప్రదించకుండా, కనీసం చట్టసభల్లో కూడా చర్చించకుండా పాలకులు అధికార దుర్వినియోగానికి పాల్పడి ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి, కొట్టే రఘురాం, డి పోతురాజు, ఎండి మస్తాన్, తిరుమాని సత్యనారాయణ, లంకె వెంకటేశ్వరరావు, జీవీఎల్ నరసింహారావు, మాదివాడ వెంకట నరసింహారావు, మెండు సురేష్ బాబు, బొల్లా రాంబాబు, ఎంఎన్ స్వామి, నారగాని మహేశ్వర రావు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము సమక్షంలో ఆదివారం స్థానిక 17వ వార్డుకు చెందిన పలువురు మైనార్టీ, బిసి సంఘాలకు చెందిన నాయకులు టిడిపిలో చేరారు. వారికి వెనిగండ్ల రాము టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ 20 ఏళ్లుగా అన్ని రంగాల్లో గుడివాడ వెనుకబడిన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడివి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జానీ, బత్తిన బాద్రచలం, శొంఠి అయ్యప్ప, మద్దుకూరు ప్రభాకర్, ఉస్మాన్, తదితరలు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు మోపుతున్న ప్రభుత్వం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

విజయవాడ : కేంద్ర ప్రభుత్వం ప్రజల పైన భారాల మీద భారాలు మోపుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. ఆదివారం సెంట్రల్ నియోజకవర్గంలో 1వ డివిజన్ ప్రజాసంఘాల విస్తృత సమావేశం గుడిసేవ ప్రసన్నరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడారు. బిజెపి ఆంధ్రప్రదేశ్‌ను తన గుప్పెట్లో పెట్టుకోవాలని కుట్రలు పన్నుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ అంటే చిన్న చూపు చూస్తోందని, విభజన హామీలు అమలు చేయటంలో విఫలమైందని విమర్శించారు. విశాఖ ఉక్కు, పోర్టులను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్తుందని రాష్ట్రంలో బిజెపి అస్తిత్వం లేకపోయినా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు పూర్తిగా దాసోహం అంటున్నాయని అన్నారు. ఒక్క కమ్యూనిస్టులు మాత్రమే ధైర్యంగా పార్లమెంట్లో ప్రజా సమస్యలపైన ప్రస్తావిస్తున్నారన్నారు. కమ్యూనిస్టులు బలం పుంజుకోవాలని, ప్రజల అండదండలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. దేవుని పేరుతో బిజెపి రాజకీయం చేస్తూ, మోడీ ప్రచారం కోసమే రామాలయం నిర్మాణం లాంటి అంశాలను ముందుకు తెస్తున్నారని అన్నారు. వైసిపి అధికారం కోసం అర్రులు చాస్తుందని, పథకాలు ఇస్తున్నామంటూ మభ్యపరుస్తుందని విమర్శించారు. ఒకపక్క కార్మికులు పనులు లేక పస్తుంటున్నారని, ఇసుక విషయంలో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిర్మాణాల ఆగిపోయాయి, దీనివల్ల కార్మికుల జీవనోపాధి దెబ్బతిందని, మరోపక్క నిరుద్యోగ సమస్య తీవ్రంగా పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివద్ధి ఎక్కడ కనపడటం లేదన్నారు. ప్రజలు కమ్యూనిస్టులను ఆదరించి అండదండలు ఇవ్వాలన్నారు. 15 సంవత్సరాల నుండి గుణదల ఫై ఓవర్ బ్రిడ్జిని అసంపూర్తిగా మిగిల్చిన పాలకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాలవ కట్టల వాసులకు ఇళ్ల పట్టాలు ఇస్తామని పాలకులు మోసం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట కళ్యాణ్, డివిజన్ నాయకులు ఫేక్ షకీలా, అజయ్, కష్ణ, ప్రజాసంఘాల నాయకులు గోవిందు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాబూరావు

సిఎం సహాయ నిధి అందజేత

సిఎం సహాయనిధి అందిస్తున్న వెలంపల్లి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : గుండె ఆపరేషన్ చేయించుకున్న పిళ్ళా దుర్గా రావుకి ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి రెండున్నర లక్షల రూపాయలు చెక్కును పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు ఆదివారం బాధితునికి అందచేశారు. ఈ కార్యక్రమంలో 51 డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ మరుపిళ్ళ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తరంజన్ గ్రంథాలయంలో...

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

విజయవాడ : ప్రతినెల మొదటి ఆదివారం నిర్వహించే బాలల పుస్తక విభాగంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులచే నీతి కథలు చెప్పించారు. అనంతరం 'ప్రాథమిక విద్య- అభినయ గేయాల ప్రాముఖ్యత' వివరించి గేయాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్, విద్యా ర్థులు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో...

చదవటం మాకిష్టం

ఠాగూర్ స్మారక గ్రంథా లయంలో పుస్తక ప్రదర్శన నిర్వహిం చారు. పుస్తకాల ఔన్నత్యాన్ని- ప్రాము ఖ్యతను పఠనాభి లాషను పెంపొందించే కార్య క్రమాలను నిర్వహిం చటం మంచి ఆలోచన అని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు రచించిన పిల్లలకు రాజ్యాంగం అనే పుస్తకాలను విద్యార్థుల చేత చదివించారు. గ్రంథాలయాధికారి రమాదేవి మాట్లాడుతూ భారత రాజ్యాంగం గురించి ఈ పుస్తకం పాఠశాల పిల్లలకు కూడా అర్థం అయ్యే విధంగా, సరళంగా ఆకర్షణీయమైన బొమ్మలు, రంగులతో వివరించటం చాలా బాగుంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది వై.ధనలక్ష్మి, జె.శంకర్, ఫణిబాబు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం, ముష్టికుంట్ల సొసైటీ నూతన భవనాన్ని విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. రూ.39.75 లక్షలతో నిర్మించిన సొసైటీ భవనంలో క్యాష్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా కెడిసిసిబి చైర్మన్ తాతినేని పద్మావతి. ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్ ఛార్జ్ ఎన్.స్వామిదాస్, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యరాణి, జెడ్పీటిసి వై.రామ చంద్రారెడ్డి, సొసైటీ ఛైర్మెన్ బండి రవి, సోషల్ వెల్ఫేర్ రాష్ట్ర డైరెక్టర్ బండి సుజాత, సొసైటీ కార్యదర్శి పసుపు లేటి శేషు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని రాజుగూడెం సొసైటీలో నూతనంగా రూ.19 లక్షలతో నిర్మించిన స్ట్రాంగ్ రూమ్, వాటర్ ప్లాంట్‌లను నాని, పద్మావతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కొమ్మినేని కిషోర్, కార్యదర్శి కోలా సూర్యా రావు తదితరులు పాల్గొన్నారు.

మనోధైర్యమే కేన్సర్‌కు మందు

ప్రజాశక్తి - గంపలగూడెం: మనోధైర్యంతోనే కేన్సర్‌ను ఎదుర్కోవడం సాధ్యమని గారిగూడెం సర్పంచ్ చెన్నా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ ప్రజలకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఉన్న కేన్సర్ బాధితులకు పండ్లు కొబ్బరి నీళ్లు అందించి, మనోధైర్యాన్ని నింపారు. జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చింతలపాటి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు నవదిన ప్రార్థనలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మతాలు వేరైనా మానవులంతా ఒక్కటేనని, అందరూ సహోదర ప్రేమతో జీవించాలని ఏలూరు మేత్రాసనం ఫాదర్ తోట గాబ్రియేలు అన్నారు. గుణదల మాత శతాబ్ది మహోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం ఐదవ రోజు నవదిన ప్రార్థలుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్యమాతగా మరియమాత భక్తులచేత కీర్తించబడుతుందని అన్నారు. విజయవాడ కతోలిక పీఠం మోన్సిగ్నోర్ రెవరెంట్ ఫాదర్ మువ్వల ప్రసాద్, గుణదల పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ 100 సంవత్సరాల మహోత్సవాలు జరుపుకోవడానికి ఇంకా నాలుగు రోజులు మాత్రమే వ్యవధి ఉండటంతో ఇప్పటి నుండే ఉత్సవాలకు నవదిన ప్రార్థనల ద్వారా భక్తులనుసంసిద్ధులను చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు శతాబ్ది మహోత్సవాలు నిర్వహించడానికి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు తోడ్పాటు అందిస్తున్నాయన్నారు. 5వ రోజు నవదిన ప్రార్థనలు ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు వెల్లువలా తరలివచ్చి గుణదల మాతను దర్శించుకున్నారు.

అంతుకుముందు ఫాదర్ తోట గాబ్రియేలు, వికార్ జనరల్ ఫాదర్ యం.గాబ్రియేలు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్‌రాజు తదితర గురువులు దివ్య సత్ర్పసాదంతో కొండపైకి చేరుకున్నారు. అనంతరం గురువులు సమిష్టి దివ్య పూజాబలి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ డస్క్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న, ఫాదర్ జాన్ పీటర్, పుణ్యక్షేత్రం సహాయ గురువులు కె.సునీల్ బాబు,బి.రవికుమార్, కె.ప్రతాప్, పలువురు పాల్గొన్నారు.

కట్టలేరు వంతెనకు శంకుస్థాపన

ప్రజాశక్తి - గంపలగూడెం : స్థానిక కట్టలేరు వంతెన నిర్మాణం పూర్తిచేసి ఈ ప్రాంత ప్రజలకు రానున్న సంక్రాంతి కానుక అందజేయనున్నట్లు విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని) పేర్కొన్నారు. వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.25.60 కోట్లు మంజూరు కాగా, ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం నాని మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ నల్లగట్ల సుధారాణి జనవరి 12వ తేదీ పార్టీలో చేరిన తొలిరోజే ఈ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సిఎం జగన్ మోహన్‌రెడ్డిని కోరినట్లు చెప్పారు. స్పందించిన సీఎం జగన్మోహన్ రెడ్డి నిధులు మంజూరుకు ఆదేశించినట్లు చెప్పారు. మార్చి ఒకటవ తేదీ నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, సంక్రాంతికి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. విజయవాడ ఎంపి అభ్యర్థిగా తనను, తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా, నల్లగట్ల స్వామి దాసు పోటీలో ఉంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.శ్రీలక్ష్మి, జడ్పిటిసి సభ్యుడు కోట శామ్యూల్, సర్పంచ్ చిమట ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు పగడాల పద్మ, రోడ్లు భవనాల శాఖ అధికారులు, కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో ఎంపి కేశినేని నాని, తదితరులు

ఆసరా చెక్కు అందజేస్తున్న సామినేని ఉదయభాను

ఆసరా విడుదలపై సంబరాలు

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : రుణమాఫీ చేస్తానని మాయ మాటలు చెప్పి మహిళలను మోసం చేసిన చంద్రబాబు నాయుడిని వచ్చే ఎన్నికల్లో తుక్కుతుక్కుగా ఓడించాలని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. ఆదివారం తంబరేణి గార్డెన్స్‌లో మండల వ్యాప్తంగా వైయస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సామినేని ఉదయభాను సతీమణి విమలభాను పాల్గొని లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. అనంతరం ఉదయభాను, విమలాభాను మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ప్రతి డ్వాక్రా అక్కచెల్లెమ్మకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాలుగు విడతలుగా రుణమాఫీ చేశారని అన్నారు. ఎంతో మంది మహిళలకు ఆర్థికంగా తోడ్పాటును అందించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, గ్రామ వైసిపి ముఖ్య నేతలు, కార్యకర్తలు, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

చింతలపాడులో కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - నందిగామ : చింతలపాడు గ్రామంలో జిల్లా పరిషత్ స్కూల్‌లో 1967-68 విద్యా సంవత్సరంలో ఎస్.ఎస్.ఎల్.సి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో ఎక్కడెక్కడ స్థిరపడినవారు తమ కుటుంబాలసమేతంగా కలుసుకుని ఆనందోత్సవాలు పంచుకున్నారు. మృతిచెందిన కొంతమంది తమ స్నేహితులను జ్ఞాపకం చేసుకున్నారు. 1967 -68 లో టీచర్‌గా పని చేసిన బొందలపాటి అప్పారావును సన్మానించారు.

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి - వత్సవాయి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలనలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. వత్సవాయి మండలంలోని గోపినేనిపాలెం గ్రామం 5వ వార్డ్, 9వ వార్డ్ మెంబర్స్ షేక్ రహ్మాన్, గుడేటి వెంకటరత్నం, సపావతు లచ్చు నాయక్, పాము యేసయ్య టిడిపిని వీడి వైసిపిలోకి చేరారు. చేరిన వారికి రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభానుపార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కామినేని రాంబాబు జడ్పిటిసి ఏసుపోగు దేవమని శ్రీనివాసరావు, ఎంపీపీ గొలుసు రమాదేవి, సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి శ్రీనివాసరావు ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో పరిశీలిస్తున్న సాయిబాబు

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి - కంచికచర్ల : నందిగామ ఆర్‌డిఒ పి.సాయిబాబు ఆదివారం మండలంలోని వేములపల్లి, మోగులూరు గ్రామ సచివాల యాలను సందర్శించారు. నవరత్నాల పథకంలో భాగంగా అర్హులకు ప్రభుత్వం కేటాయించిన నివేశన స్థలాలు, పక్కా గృహాలను సచివాల యాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిం చారు. సచివాలయం సిబ్బందికి రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

తుపాను నష్టపరిహారమివ్వాలి

ప్రజాశక్తి - నందిగామ : కరువు మిచౌంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి మల్నిడి యలమందరావు చుండూరు సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం నందిగామ సిఆర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సంవత్సరం కరువు తుఫాన్లతో నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారమివ్వాలని, రైతులకు కౌలు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ ఈ నెల 8న కలెక్టర్, ఆర్‌డిఒ, కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు వినతిపత్రాలు ఇవ్వాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు పొల్లేడినాగభూషణం, నందిగామ మండల సిపిఐ పార్టీ కార్యదర్శి మన్నే హను మంతరావు వేముల వీరయ్య, సిపిఐ సీనియర్ నాయకులు బలసపాటి రాంబాబు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో ఇబ్బందులు

• నడిచేందుకు దారిలేక పాదచారుల ఇబ్బందులు

ప్రజాశక్తి-గన్నవరం : పట్టణంలోని ప్రధాన జాతీయ రహదారికి ఇరువై పులా దాదాపు కిలోమీటర్, వెంకటేశ్వర థియేటర్ సెంటర్ నుంచి దావాజీగూడెం పంచాయతీ కార్యాలయం వరకు ఫుట్ పాత్ ఆక్రమణదారులకు వరంగా మారింది. ప్రజలు జాతీయ రహదారిపై నడిచి ప్రమాదాల బారినపడకుండా వారి సౌలభ్యం కోసం నడకదారులు ఏర్పాటు చేశారు. కానీ పలు వురు వ్యాపారులు, భవన యజమానులు పోటీపడి మరీ వీటిని దర్జాగా ఆక్రమించుకుని వాటిపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. షాపుల యజమానులు ఫుట్ పాత్ లను వ్యాపారులకు అద్దెకిచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. రోజుకు 100 రూపాయల నుంచి 300 వరకు వసూలు చేస్తున్నారంటే వీరి సంపాదన ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజలు నడిచేందుకు అంగుళం దారి

ఫుట్‌పాత్‌లు ఆక్రమించిన దృశ్యం

లేకుండా అడ్డంగా సామాగ్రి విక్రయిస్తు న్నారు. ఏమని ప్రశ్నిస్తే ఎదురుదాడికి దిగుతున్నారు. దీంతో పాదచారులు విధిలేని పరిస్థితుల్లో ప్రధాన రహదారులపై నడిచి రాకపో కలు సాగిస్తున్నారు. ఫలి తంగా కొంతకాలంగా ట్రాఫిక్ సమస్య ఎక్కువయ్యింది. దీనికితోడు ఆయా మార్గాల్లో నిత్యం ఒకటి, రెండు చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు గాయపడుతున్నారు. గాంధీ బొమ్మ సెంటర్, వీనస్ సెంటర్, వెంకటేశ్వర థియేటర్ సెంటర్, బస్టాండ్ సెంటర్, సెయింట్ జోన్స్ సెంటర్ ఏరియాలలో పుట్పాతులు డ్రైనేజీలు ఆక్రమణ చేసుకొని కొట్లు కట్టేశారు. తమ వ్యాపారాల కోసం ప్రభుత్వ, పంచాయతీ స్థలాలను ఆక్రమించుకొని అనుభవి స్తున్నారు. పేదవారు ఎవరైనా ఆక్రమణ చేస్తే వెంటనే పీకేసే అధికారులు పెద్దవాళ్లను మాత్రం ఏమీ చేయడం లేదని విమర్శ ఉంది.

అధికారుల ప్రేక్షకపాత్ర : పంచాయతీలో నడకదారులు ఏళ్లుగా ఆక్రమణలకు గురవుతుంటే పంచా యతీ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. కనీస పర్యవేక్షణ కూడా లేకపో వడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడితే రాజకీయ ఒత్తిడులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న భయం కూడా వారిలో వెంటాడుతోంది. ఇప్పటికైనా ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని దష్టిలో పెట్టుకుని అధికారులు సత్వరమే చర్య లకు ఉపక్రమించాల్సిన అవసరం ఉంది.

జిల్లా స్థాయి హాకీ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : జిల్లా స్థాయి సబ్-జూనియర్ బాలుర, బాలికల హాకీ జట్ల ఎంపిక పోటీలను కష్ణా జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆంధ్ర జాతీయ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. హాకీ కష్ణా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెలక్షన్స్ ద్వారా ఎంపిక అయిన క్రీడాకారులు క్రీడాకారిణి లు కష్ణా జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

సబ్-జూనియర్ బాలుర జట్టు : బి. శివ సతీష్ బాబు,డీ. తరుణ్ కుమార్,ఎం. సాయి మోహన్ జి.లకివీరబాబు, జి. మహిదర్, సి హెచ్ వనసాయి,ఎస్. భారత్ కుమార్ ,జి ఉదయ్, వై. నాగ చైతన్య,యూ రుత్విక్, ఎ మహేశ్వర మాధవరావు,వి.సి అమర్నాథ్ ,వి ఉపేంద్ర, కె మోహన్ కుమార్ పి హిమ కిరణ్, సీ హెచ్ వెంకట సాయి, కె హర్శిత్ ఏ. నంద,స్టాండ్ బై బి కళ్యాణ్ తేజ, ఎం నవనందన ఈశ్వర్.

జూనియర్ బాలికల జట్టు : కె ఇంద్రజ, ఎల్ రమాల్య, జే వనజ శ్రీ,పి సాహిత్య కె జస్విత టి సుప్రియ, కె హెమశ్రీ, వి జ్ఞానశ్రీ, జి అరుణ, సి హెచ్ హేమ విజయ లక్ష్మి,జి సిరి మేఘన, జి హాసిని,యస్. శరణ్య,పి మౌనిక,పి యస్విత, వి మొహనాంజలి, సి హెచ్ నాగజ్యోతి, టి కుసుమ భవాని,స్టాండ్ బై జి దీపికా దీక్షిత,ఆర్. లహిత్య. ఎంపికైన సబ్ జూనియర్ బాలుర జట్టు కర్నూలులో 10వ తేదీ నుండి 12వ తేది వరకు మరియు బాలికలు 9వ తేది నుండి 11వ తేది వరకు శ్రీకాకుళం లో నిర్వహించే 14వ ఏపీ అంతర్ జిల్లా హాకీ చాంపియన్షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రెటరీ శ్రవణం రామకష్ణ పరమహంస,హాకీ కష్ణ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు సన్నిధి నాగ సాయి శ్రీనివాస్, కార్యదర్శి శ్రవణం హరికష్ణ, కోశాధికారి విఠల్, మరియు అసోసియేషన్ సభ్యులు రామనాథం కిషోర్ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : కాటూరుకు చెందిన మహిళా సంఘం దివంగత నాయకురాలు నాగళ్ల రాజేశ్వరమ్మ కు మార్తె ప్రముఖ వైద్యురాలు, సంఘ సేవకురాలు నాగళ్ల జ్యోతి సంస్మరణార్థం విన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు, వానప్రస్థ వద్ధాశ్రమం లో వద్ధులకు ఆదివారం పండ్లు, రొట్టెలు పంపిణీచేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నర్రా సుధారాణి, అన్నే రాణి ఈసందర్భంగా మాట్లాడుతూ వైద్యురాలు, సంఘ సేవకు రాలిగా జ్యోతి చేసిన సేవలు ఎనలేనివన్నారు. వైద్యురాలిగా ఎందరికో సేవలందించిన జ్యోతి ఇటీవల మతి చెందగా ఆమె జ్ఞాపకార్థం పండ్లు పంపిణీచేశామన్నారు. జ్యోతి మాతమూర్తి ప్రముఖ్య కమ్యూనిష్టు, మహిళా సంఘ నాయకురాలిగా మహిళాభ్యుద యం కోసం ఎంతో కషిచేసారని, ఆదర్శ నాయకురాలి కుమార్తెగా జ్యోతి వైద్య సేవల తో పాటు సమాజసేవ కార్యక్రమాలు చేపట్టారని

పండ్లు, రొట్టెలు పంపిణీచేస్తున్న నర్రా సుధారాణి

గుర్తుచేశారు. ఆమె తలితండ్రుల పేరిట ఉయ్యూరులో నాగళ్ల రాజేశ్వరమ్మ, జానకిరామయ్య విజ్ఞాన కేంద్రం నిర్మించి ఎందరికో సేవలందిస్తూ మతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. క్లబ్ సభ్యులు సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

205 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిబిఆర్. ఫౌండేషన్, ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జ్యోతి రావు పులే విజ్ఞాన నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం లో 205 మందికి వైద్య సేవలు అందిచినట్లు మెడికల్ క్యాంప్ కన్వీనర్ పి.నాగయ్య తెలిపారు. జి.బి.ఆర్. ఫౌండేషన్, ప్రజా ఆరోగ్య వేదిక మరియు ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ గోపాలం శివన్నారాయణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 205 మంది రోగులకు వైద్య సేవలు అందించారు.ొండు నెలలకు సరిపడా మందులు రు.200 కే అందిచారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డి ఆర్ కె.ప్రసాద్ కుప్పా రామశాస్త్రి లు వైద్య సేవలు అందిచారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కంకిపాడు : దేవినేని ఆర్మీ లయన్ ఇంజనీర్ రావి. సురేష్ బాబు ఆధ్వర్యంలో కంకిపాడు మండలం మద్దూరు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వయో వద్ధులు బొడ్డు.తిరుపతమ్మ, దశరథరామయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం, నిత్యావసరసరుకులు అందించారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజా, కాసరనేనివారిపాలెం సర్పంచ్ పెద్దు.ప్రసాద్, మద్దూరు గ్రామస్తులు ప్రసాద్, రావి సాంబ శివరావు, రావి.అప్పారావు, రావి.నాం చారయ్య, రావి. రాజేష్, రావి.వాసు, యనమ దల. రామ్మోహన్‌రావు, యనమదల మదన్ పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-చల్లపల్లి : పాత పెన్షన్ విధానాన్ని సాధించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. కనకరావు, టి లెనిన్ బాబులు అన్నారు. స్థానిక గుంటూరు స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఓటిఎఫ్ గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన వారు మాట్లాడుతూ పాత పెన్షన్ సాధించేందుకు రాష్ట్ర కమిటీ కార్యాచరణ అమలుపరిచేందుకు మండల, పట్టణ శాఖ బాధ్యులకు పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి నుండి ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఫిబ్రవరి 1 నుండి 7 వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద పోస్టర్లతో ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఫిబ్రవరి 5 న అన్ని రాజకీయ పార్టీలకు కార్డు క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 12 నుండి 15 వరకు అన్ని రాజకీయ పార్టీల మండల స్థాయి నాయకులకు ప్రాతినిధ్యం వహించాలన్నారు. ఫిబ్రవరి 18 నుండి 21 వరకు అన్ని శాసనసభ నియోజక వర్గాల ఇన్చార్జి / అభ్యర్థులకు విజ్ఞాపన చేయాలన్నారు. మార్చి 26 నుండి 30 వరకు అన్ని నియోజకవర్గాలలో బైక్ ర్యాలీ నిర్వహిస్తామని వివరించారు. వైఎన్ఆర్ యోగ మాస్టర్ అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎన్ వెంకటేశ్వరరావు, ఎల్ సుభాషిణి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి శివ కోటేశ్వరరావు, శాఖ బాధ్యులు పాల్గొన్నారు

కంపా కిషోర్‌కి డాక్టరేట్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలోని వి.ఎన్ పురం కాలనీ లో ఉంటున్న విద్యావేత్త కంపా కిషోర్ ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం జిల్లా అంతర్గత గిరిజన ప్రాంతా లలో వ్యవసాయ పద్ధతు లపై పరిశోధన ఫలితంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఫుల్ టైం లో డాక్టరేట్ డిగ్రీనీ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖర్ బాబు పర్యవేక్షణలో ఈ పరిశోధన చేశారు. కిషోర్ పరిశోధనలో విజయనగరం జిల్లాలోని బాగా వెనుకబడిన గిరిజన ప్రాంతాలైన ఐటిడిఎ పరిధిలోని వ్యవసాయానికి దోహదబడే చెక్ డ్యాం, ల్యాండ్ డెవలప్మెంట్ ప్రోగ్రాం, ఏపీ టీడీపీ, ఐఎఫ్ఏడి, ,జి. సి. సి. పోడు వ్యవసాయం భూ సారాన్ని పెంచే అంశాలు సాంకేతిక వ్యవసాయం తదితర అంశాలపై పరిశోధనలు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయ రంగంపై పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఏ ఎన్ యు ప్రొఫెసర్ డాక్టర్ పి.రాజశేఖర్, ఆర్ట్స్ అండ్ కామర్స్ లా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్. చల్లపల్లి స్వరూ పారాణి, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ సి డి సి డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె. మధు బాబు, సోషల్ సైన్స్ డీన్ డాక్టర్ యం . త్రిమూ ర్తులు , ప్రొఫెసర్ ఎం రాజశేఖర్ బాబు అభినందనలు తెలిపారు..

క్రికెట్ కిట్టు బహుకరిస్తున్న శ్యామ్ కిషోర్ నాయుడు

క్రికెట్ కిట్టు బహూకరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డకు చెందిన తుంగపల్లెమ్మ తల్లి క్రికెట్ జట్టుకు శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు రూ 5 వేల విలువచేసే క్రికెట్ కిట్టును బహుకరించారు. ఆదివారం అవనిగడ్డ డిగ్రీ కళాశాలలోని తేడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో జట్టు నిర్వాహకులు గుండా బత్తిన మైథిల్ విశ్వం శెట్టి గోపాల్ లకు కిట్టును అందజేశారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలతో పాటు క్రీడలను కూడా ప్రోత్సహించేందుకు శ్యామ్ కిషోర్ నాయుడు చేస్తున్న సహాయం మరువలేనిదని పంచాయతీ పాలకవర్గ మాజీ సభ్యులు డేగల రాఘవ తెలిపారు. ఈ కార్యక్రమంలో వి కష్ణప్రసాద్, జై వెంకటేష్, మోపిదేవి కోటేశ్వరరావు, సాయ పి ణి ం ద్ర తదితరులు పాల్గొన్నారు.

'చలో అసెంబ్లీ'ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : రాష్ట్రంలో 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదలచేసిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ. 8,629కోట్లు రాష్ట్రప్రభుత్వం దారి మళ్లించిన నిధులు తిరిగి సర్పంచుల ఖాతాల్లో జమచేయాలని, ఇతర డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మంగళవారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, ఆంధ్రపదేశ్ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్లు చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సర్పంచుల సంఘం ఉమ్మడి కష్ణాజిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్ తెలిపారు.. ఆకునూరులో ఆదివారం సర్పంచుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వలంటీర్లు సర్పంచుల ఆధీనంలో పనిచేయించాలని, ఉపాధి హామీ నిధులను చట్టప్రకారం గ్రామ పంచాయతీలకు, సర్పంచుల చేత ఖర్చు చేయించాలని, గతంలో మాదిరిగా గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యు త్ ఇవ్వాలని, సర్పంచులు, ఎంపీటీసీలకు రూ. 15వేలు ఎంపీపీలు, జడ్పీటీసీలకు రూ. 30వేలు గౌరవవేతనం, సర్పంచుల 16 డిమాండ్లు ఆమోదించాలని పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ నాయకత్వంలో తలపెట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమంలో పార్టీలు, రాజకీయల కతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. సర్పంచులు సూరపనేని ప్రసాద్, షేక్ జాన్బాష, యెనిగళ్ల శిరీష తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య నేతలతో ఎంఎల్ఎ వసంత భేటీ

ప్రజాశక్తి-మైలవరం : మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్ ఆదివారం మైలవరం నియోజకవర్గంలోని పలువురు ముఖ్య నేతలతో నందిగామ నియోజకవర్గం ఐతవరంలోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సమావేశం జరుగుతున్న సమయంలో టిడిపిలోకి వెళ్తారని, మైలవరం లేదా పెనమలూరు నియోజకవర్గాల్లో ఏదో ఒకచోట పోటీ చేస్తారని ప్రచారం జోరుగా సాగింది. నందిగామకు చెందిన వసంత కృష్ణప్రసాద్ 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మైలవరం వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి మాజీ మంత్రి దేవినేని ఉమాపై 12 వేల పైచిలుకు ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. తాజాగా వైసిపి మైలవరం నియోజకవర్గ సమన్వయకర్తగా మైలవరం జడ్పిటిసి స్వర్ణాల తిరుపతిరావును నియమిస్తూ వైసిపి కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. అప్పటి నుండి ఎమ్మెల్యే వసంత టిడిపిలోకి వెళ్తారని, కొందరు జనసేనలోకి వెళ్తారని నియోజకవర్గంలో ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వసంత మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు,

నాయకులతో చర్చలు జరిపారు. సోమవారం మరలా మరికొందరు నాయకులతో మాట్లాడిన అనంతరం తన నిర్ణయాన్ని వెల్లడిస్తానని విలేకరులకు తెలిపారు. మాజీ మంత్రి దేవినేని ఉమా ఆదివారం గుంటుపల్లిలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో రాజకీయ భిక్షగాళ్లు వస్తున్నారని, వారిని తరిమికొట్టాలంటూ ఎమ్మెల్యే వసంత, ఎంపి కేశినేని నాని, సుజనా సోదరులను ఉద్దేశించి అన్నారు. దీనిని బట్టి వసంత టిడిపిలో చేరతారని ప్రచారం ఊపందుకుంది.

28 మంది సొసైటీ చైర్మన్ల తొలగింపు

ప్రజాశక్తి-మైలవరం: మైలవరం నియోజకవర్గంలో 28 మంది కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్లను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే వారికి అనుకూలంగా ఉన్న వారిని సొసైటీ చైర్మన్‌గా నామినేటెడ్ పద్ధతిలో నియమిస్తారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మైలవరం ఎంఎల్ఎగా వైసిపికి చెందిన వసంత కృష్ణప్రసాద్ గెలుపొందారు. నియోజకవర్గంలోని పలు సొసైటీలకు ఆయన తనకు అనుకూలమైన వారిని నియమించారు. వైసిపి అధిష్టానం సిట్టింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను కాదని మైలవరం జడ్పిటిసి స్వర్ణాల తిరుపతిరావును మైలవరం నియోజకవర్గ సమన్వయకర్తగా ఇటీవల నియమించింది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే వసంతకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో 28 మంది సొసైటీ చైర్మన్లతో పాటు సభ్యులను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు కేటాయించాలి

దేవాంగుల సంక్షేమ సంఘం సదస్సులో నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది దేవాంగుల ఓట్లు ఉన్నాయని, రాజకీయంగా తగిన ప్రాధాన్యతను ప్రధాన రాజకీయ పార్టీలు ఇవ్వడం లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డీకే నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మంగళగిరి ఆర్అర్ కన్వెన్షన్ హాల్‌లో దేవాంగ ఆత్మ గౌరవ సభకు అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు బల్ల వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం, అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మంగళగిరి ఎన్నారై జంక్షన్ వద్ద ఉన్న చేనేత సర్కిల్ బైపాస్, ఎన్నారై, పాత మంగళగిరి సీతారాముల వారి కోవెల మీదుగా ఆర్అర్ కన్వెన్షన్ హాల్ వరకు దేవాంగ ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సదస్సులో నాగరాజు మాట్లాడుతూ రాజకీయంగా బలపడటం ద్వారానే దేవాంగుల సమస్యలు పరిష్కరించబడతాయన్నారు. దేవాంగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ, పొన్నూరు మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ సజ్జా హేమలత మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలు దేవాంగులను ఓటు బ్యాంకు గానే చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇచ్చాపురం నుండి ధర్మవరం వరకు ప్రతి నియోజకవర్గంలోనూ దేవాంగుల ఓట్లు పదివేల నుంచి 15 వేల 15 వేల ఓట్లు వరకు ఉన్నాయని, చీరాల నియోజకవర్గంలో సీటును కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇవ్వని పక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తామన్నారు. అదేవిధంగా రాజమండ్రి రూరల్, పుట్టపర్తి అసెంబ్లీ స్థానాలతో పాటు హిందూపురం ఎంపీ సీటును కూడా కేటాయించాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం మూడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానాలను ఏ రాజకీయ పార్టీ ఇస్తుందో ఆ పార్టీ వెంటే నడుస్తామన్నారు. ఆత్మగౌరవ సభలో బీరక ప్రసాదు, ఆకాశపు స్వామి, నక్కిన రాజశేఖర్, నక్కిన విజయలక్ష్మి, ఏరాసు అరుణ బాబు, ఆనెం ఆనంద కుమార్ , పులి రామచంద్ర, గిద్దలూరి ఎర్ర స్వామి, సజ్జ వెంకటేశ్వరరావు, అల్లక తాతారావు, నక్కిన దొరబాబు అల్లక తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో ఈత పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 24వ కృష్ణానది రివర్ క్రాస్ ఈత పోటీలు నిర్వహించారు. విజయవాడ దుర్గా ఘాట్ నుంచి అమరావతి కరకట్ట వరకు 1.5 కిలోమీటర్ల ఈత పోటీల్లో వివిధ వయసుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం ఆరు కేటగిరీలుగా విభజించారు. పురుషులతో పాటు మహిళలు కూడా ఈ పోటీల్లో పాల్గొన్నారు. 433 మంది ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని నిర్వాహకులు చెప్పారు. పురుషులతో సమానంగా ఆరు కేటగిరీల్లో 66 మంది మహిళలు పాల్గొన్నారని వివరించారు. అనంతరం అమరావతి కరకట్ట రోడ్డులోని ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ లైఫ్ చైర్మన్, మాజీ ఎంపి గోకరాజు గంగరాజు, దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్ డైరెక్టర్ డివి మధుసూదరావు, భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎంఎస్‌కె ప్రసాద్, లైలా గ్రూప్ కంపెనీస్ డైరెక్టర్ గోకరాజు ఆదిత్యవర్మ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి కూడా ఈ పోటీల్లో ఈతగాళ్లు పాల్గొన్నారని తెలిపారు. నదిలో పోటీలు జరిగే సమయంలో ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా డిజాస్టర్ సర్వీస్ ఫైర్ డిపార్టుమెంట్ 50 మంది రెస్క్యూ టీమ్ అప్రమత్తంగా ఉండి తమ సేవలందించారని తెలిపారు. అనంతరం రాష్ట్ర ఎన్‌డిఆర్ఎఫ్ ఫైర్ డిపార్టుమెంట్ రెస్క్యూ టీమ్ గుండెపోటు

ప్రమాదం జరిగినప్పుడు, ఎవరికైనా హార్ట్ స్ట్రోక్ వచ్చినప్పుడు సిపిఆర్ చేయడం ద్వారా వారి ప్రాణాలు రక్షించే పద్ధతిని డెమోగా చేసి చూపించారు. అలాగే ఆహారం తీసుకునే సమయంలో గొంతులో అడ్డం పడినట్లు అయితే దాన్ని తీసే విషయంలో ఆలస్యం చేయకుండా తీసే పద్ధతిని చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వెలగపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ, కార్యదర్శి ఎంఎల్ నరసరాజు, కన్వీనర్ అమ్మిరెడ్డి రామిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

డ్వాక్రా గ్రూపులకు రూ.1181.49 కోట్లు రుణమాఫీ

అప్పు నాలుగు దఫాలుగా తిరిగి లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది. ఈనెల 14 వ తేదీతో నాలుగు విడతలు పూర్తవుతాయి. ఈ పథకంలో జిల్లాలోని 31,336 గ్రూపుల్లోని 3,07,510 మంది మహిళలకు రూ.1181 కోట్ల 49 లక్షలు లబ్ధి చేకూరింది.

ప్రశ్న: జిల్లాలో పొదుపు సంఘాలకు లింకేజీ రుణాలు ఎంత మంజూరయ్యాయి.?

లింకేజీ రుణాలు నిరంతర ప్రక్రియ. రుణాలు చెల్లించిన గ్రూపులకు అర్హతలకు అనుగుణంగా తిరిగి బ్యాంకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుంది. జిల్లాలో 1177 గ్రామసంఘాల్లోని 31,834 గ్రూపుల్లో 3,29,539 మంది మహిళలు సభ్యులున్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 23,178 గ్రూపులకు రూ.1575 కోట్ల 37 లక్షలు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 17,993 గ్రూపులకు 1,481 కోట్ల 57 లక్షలు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 10 నెలల కాలంలో 1570 గ్రూపులకు రూ.1123 కోట్లు రుణాలు మంజూరయ్యాయి.

ప్రశ్న: ఇతర పథకాల్లో గ్రూపులకు ఎటువంటి సాయం అందుతోంది?

వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో నాలుగు విడతల్లో 3,03,554 మంది గ్రూపు సభ్యులకు రూ.125.42 కోట్లు లబ్ధి చేకూరింది. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 45 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల ఎస్.సి, బిసి, మైనార్టీ వర్గాల మహిళలకు ఏటా రూ. 18,750 చొప్పున నాలుగేళ్లు రూ.75 వేలు ఆర్థిక సాయం అందించడం జరుగుతోంది. ఈ పథకంలో మూడు విడతల్లో లక్ష మంది లబ్ధిదారులకు రూ.562 కోట్లు లబ్ధి చేకూరింది.

ప్రశ్న: గృహ నిర్మాణాలకు బ్యాంకు రుణాలు ఎంత మందికి మంజూరయ్యాయి?

నవరత్నాలు పేదలందరికి ఇళ్లు పథకంలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి డిఆర్‌డిఎ, వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ప్రతి ఇంటికి రూ. 35 వేలు ఇనిషియల్ మొబలైజేషన్ అడ్వాన్స్ కింద మంజూరు చేశాం. 26,621 మంది లబ్ధిదారులకు రుణాలు అందించాం.

ప్రశ్న: మహిళా మార్టులు విస్తరిస్తున్నాయా?

మహిళా మార్టుల్లో అన్ని రకాల సరుకులు అమ్మకాలు జరుగుతున్నాయి. జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. అవనిగడ్డ, పెడన కేంద్రంగా రెండు ఏర్పాటయ్యాయి. ఒక్కో దుకాణంలో రోజువారీ సగటున రూ.40 వేలపైగా విక్రయాలు జరుగుతున్నాయి. గన్నవరం, నాగాయలంక, మొవ్వ, పామర్రు ప్రాంతాలకు మార్టులు విస్తరించేందుకు కృషి జరుగుతోంది.

ప్రశ్న: పరివర్తన్‌లో ఎందరికి జీవనోపాధి కల్పించడానికి కృషి జరిగింది?

నాటుసారా తయారు చేస్తున్న మహిళలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కోసం వివిధ చిరువ్యాపారాలపై అవగాహన కల్పిస్తున్నాం. వారు చేయగలిగిన వ్యాపారానికి బ్యాంకు రుణాలు మంజూరు చేయిస్తున్నాం. స్త్రీ నిధి బ్యాంకు లింకేజీ ద్వారా ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు రుణాలు అందాయి. ఐదు మండలాల్లో 36 మంది మహిళలకు రూ. 24.10 లక్షల రుణాలు మంజూరయ్యాయి.

రసవత్తరంగా మైలవరం రాజకీయం

నిర్ణయాన్ని వెల్లడిస్తానని ఇది వరకే ఆయన వెల్లడించారు. అందులో భాగంగా మైలవరం నియోజకవర్గంలోని మండల స్థాయి నేతలు, ప్రజాప్రతినిధులతో వసంత కృష్ణప్రసాద్ సమావేశం నిర్వహించారు.

ఎంట్రీకి మాజీ మంత్రి బ్రేకులు

మరో వైపు టిడిపిలో చేరేందుకు కృష్ణప్రసాద్ రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కృష్ణప్రసాద్ తండ్రి టిడిపికి చెందిన వారు కావడంతో మైలవరం టిడిపి టిక్కెట్ తనకే ఇస్తారనే ధీమాతో ఉన్నారు. అయితే మైలవరం టిడిపి టిక్కెట్‌ను మాజీ మంత్రి దేవినేని ఉమా ఆశిస్తున్నారు. అంతేకాకుండా వసంత కృష్ణ ప్రసాద్ టిడిపిలోకి చేరడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. టిడిపిలోకి కృష్ణప్రసాద్ ఎంట్రీని అడ్డుకోవాలని చూస్తున్నట్లు ఆ పార్టీ శ్రేణుల్లో చర్చించుకుంటున్నారు. 25 ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తుంటే గతంలో టిడిపిలో ఉన్న వారు తల్లి పార్టీలో చేరి ఆస్తులు సంపాదించుకున్నారని, మైలవరం టిక్కెట్ కావాలంటూ పార్టీలోకి దూరి రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని ఇటీవల పరోక్షంగా కృష్ణప్రసాద్‌ని ఉద్దేశించి దేవినేని విమర్శించడం తాజాగా చర్చనీయాంశంగా మారింది. దీంతో మైలవరం టిడిపి టిక్కెట్ ఎవరికి దక్కనుందనేది ఆసక్తికరంగా మారింది.

నాలుగు పర్యాయాలు టిడిపి

మైలవరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు టిడిపి నాలుగు పర్యాయాలు గెలుపొందగా వైసిపి ఒక సారి గెలిచింది. మాజీ మంత్రి దేవినేని ఉమా రెండు దఫాలు ఇక్కడ నుంచి విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి అప్పసాని సందీప్, పిఆర్‌పి అభ్యర్థి లక్ష్మీ అనుపమ చౌదరి మధ్య జరిగిన త్రికోణ పోటీలో 12,667 ఓట్ల మెజారిటీతో దేవినేని ఉమా గెలుపొందారు. 2014లో వైసిపి అభ్యర్థి జోగి రమేష్ మీద 7,569 ఓట్ల ఆధిక్యంతో దేవినేని ఉమా గెలిచారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ ఇక్కడ నుంచి గెలుపొందారు. తన ప్రత్యర్థి దేవినేని ఉమా మీద 12,747 ఓట్ల మెజారిటీతో గెలిచారు.

మహిళా చైతన్యానికి జ్యోతి కృషి

గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. మాజీ ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అన్నే విజయలక్ష్మి, రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి వై.కేశవరావు, సిపిఎం రాష్ట్ర నాయకులు కాట్రగడ్డ స్వరూపరాణి, సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ పేద ప్రజలకు జ్యోతి ఉచిత వైద్యం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీరజ, డాక్టర్ పూర్ణచంద్రరావు, డాక్టర్ అమన్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ వెంకట్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. శివనాగేంద్రం, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమాచనేని జ్యోతి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు బి.కీర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శీలం ప్రకాష్, పవన్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్, సిపిఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి.రాజేష్, నాగళ్ల రాజేశ్వరమ్మ, జానకిరామయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు నిమ్మాది గోపాల్, ఎస్‌కె ఇస్మాయిల్, విశ్వశాంతి విద్యాసంస్థల అధినేత మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు
7
సోమవారం 5 ఫిబ్రవరి 2024

పెడన ఎస్ఐకు సవాళ్లు

- నేడు బాధ్యతలు చేపట్టనున్న శ్రీనివాస్

ప్రజాశక్తి- పెడన : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో పెడన ఎస్సై గా పనిచేస్తున్న రవిచంద్రను ఉంగుటూరుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో సోమవారం ఆత్కూరు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే ఏళ్ల తరబడి మున్సిపాలిటీ, రూరల్ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ప్రస్తుతం విధులు చేపట్టనున్న శ్రీనివాసులు కత్తి మీద సామే అన్నట్లుగా ఉంటుందని పలువురు అభిప్రాయంపడుతున్నారు. మున్సిపాలిటీ, రూరల్ మండలాల్లో అసంఘిక కార్యక్రమాలకు నిలయంగా ఈ స్టేషన్ మారిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ నాయకులకి తలొగ్గ్గి ఎంతవరకు దష్టి సాధిస్తారు, అన్నది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో పనిచేసిన వారికి లాగా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తారు లేదా చట్ట ఉల్లంఘన చేసిన వారికి శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటారు అన్నది వేసి చూడాల్సిందే.

చక్రం తిప్పుతున్న సీనియర్ కానిస్టేబుల్లు : గత 15 ఏళ్లగా ఎంతో మంది ఎస్సైలు బదిలీ ఆనప్పటికీ ఈ పోలీస్ స్టేషన్ లోని ఇద్దరు, ముగ్గు కానిస్టేబుళ్లు తిష్ట వేసుకుని ఇక్కడే కొలువుంటున్నారు. కొన్ని సందర్భాల్లో అపోహలు, ఆరోపణలపై ఉన్నతాధికారులు బందరు లోని పలు పోలీస్ స్టేషన్లకు బదిలీ చేసినప్పటికీ పనితీరులో తేడా కనిపించడం లేదని సాటి ఉద్యోగులే చెబుతున్నారు. దీంతో స్థానికులు, వ్యాపారస్తులకు వీరు చెప్పిందే దైవ సంబోచిత సమానమంటూ తమ మొక్కుబడును సమర్పించుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ స్టేషన్లో తిష్టవేసి కూర్చున్న ముగ్గురు కానిస్టేబుల్ చక్రం తిప్పుతున్నారు. ఈ అసాంఘిక కార్యకలాపాలకు పార్టీ నాయకులు అండదండలు ఉండడంతో వీటిని కొనసాగుతున్నప్పటికీ కేసులు మాత్రం అంతంత మాదిరిగా నమోదు అవుతున్నాయి. వీరిలో ఒకరు గత నాలుగేళ్ల క్రితం బందరు తాలూకా పిఎస్ లో పనిచేస్తూ బందరు మండల పరిధిలోని హుస్సేన్ పాలెం కు చెందిన ఒక వ్యక్తిని పోతేపల్లి పంట పొలాల్లో తీసుకెళ్లి దారుణంగా కొట్టాడు. దీంతో అతను కోమాలోకి వెళ్లి మూడు నెలల పాటు మంగళగిరిలో ఎన్నారై ఆస్పత్రిలో చికిత్సలు కూడా పొందిన దాఖలాలు ఉన్నాయి. అదే తరహాలో మళ్లీ సెటిల్మెంట్లు అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

పెడన పోలీస్‌స్టేషన్

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం కావాలి

ప్రజాశక్తి-గన్నవరం : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అందరూ భాగస్వామ్యం కావాలని గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ చిప్పాడ చంద్ర శేఖరరావు పిలుపు నిచ్చారు. క్యాన్సర్ నిర్మూలనా దినోత్సంగా సందర్భంగా ఆదివారం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం, ప్రాధాన వీధులలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి కొత్త ప్రపంచం మనం చూడాలంటే నేడు ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. క్యాన్సర్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ సమాజంలో నివసించే వ్యక్తుల అలవాట్లను బట్టి తమ ఆరోగ్యం ఉంటుందని తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి విక్టర్ బాబు, వాకర్స్ అసోసియేషన్ స్థాపిత నాయకులు సుబ్బారావు, ఫిజికల్ డైరెక్టర్ ధనియాల నాగరాజు తదితరులు మాట్లాడుతూ సిగరెట్, పోగాకు,వంటి అనారోగ్యం క్షీణించే వాటిని దూరం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్లు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే ఉన్న సమాధులు

శ్మశానవాటికలకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల : పేదలకు శ్మశాన వాటిక కేటాయించాలని కష్ణాపురం, పైడిగుండ్లపాలెం గ్రామ దళితులకు శ్మశాన వాటికలు కేటాయించాలని సామాజిక కార్యకర్త జంపాల శ్రీనివాస్ కోరారు. ఆదివారం ఆయన పమిడిముక్కల మండలంలోని వీరంకిలాకులు వద్ద మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కష్ణాపురం దళితవాసులు మరణించిన వారిని రోడ్డు పక్కనే పూడ్చుతున్నారన్నారు. అధికారులు కల్పించుకొని వారికి న్యాయం చేయాలని, శ్మశాన వాటిక స్థలం కేటాయించాలని కోరారు. ఈ విషయమై మండల రెవెన్యూ అధికారులను, జిల్లా అధికారులను లోకాయుక్త ద్వారా కోరినట్లు వివరించారు. పైడికొండపాలెంలో కూడా మరణించిన వ్యక్తులను రోడ్డుకు ఇరువైపులా పాతి పెడుతున్నారని అన్నారు. అక్కడ కూడా స్థలం కేటాయించాలని కోరారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం 25 వేల మంది భక్తులు ఆదివారం దర్శించుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణఅధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబడ్లు తీర్చుకున్నారు. అలాగే కష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. దేస్థానకార్యనిర్వహణాధిక సురేష్ బాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి యొక్క చిత్రపటం, శేష వస్త్రము, మరియు ప్రసాదము ఆమెకు అందజేశారు. దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి, సిబ్బంది ఏర్పాట్లు పరిశీలించారు.

గూడూరు పిఎసిఎస్ అధ్యక్షుడిగా 'కారుమంచి'

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు పిఎసిఎస్ అధ్యక్షుడిగా కారుమంచి కామేశ్వరరావు నియమితులయ్యారు. కారుమంచి కామేశ్వరరావుని నియమించినందుకు గూడూరు ఎంపీపీ సంఘా మధుసూదన్‌రావు, కెడిసిసీ బ్యాంకు డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, అలాగే గూడూరు మండల వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షుడు పరణం పెదబాబు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కామేశ్వంరావు మంత్రి జోగి రమేష్‌ను కలిశారు.ఈ సందర్భంగా జోగి మాట్లాడుతూ ప్రభుత్వపరంగా సంఘం ద్వారా రైతులకు అందించే రాయితీలను సకాలంలో అందిస్తూ సంఘ అభివద్ధికి కషి చేయాలని సూచించారు. తనకు ఈ అవకాశం కల్పించినందుకు మంత్రి జోగి రమేష్ కు కామేశ్వరరావు కతజ్ఞతలు తెలిపారు.

కోలవెన్నులో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం కోలవెన్ను గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యతు గ్యారంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పెనమలూరు నియోజకవర్గ ఇంచార్జ్ బోడే ప్రసాద్ సతీమణి బోడే హేమ ప్రసాద్ పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు తుమ్మల జగదీష్ , సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరి కష్ణ , కొండ నాగేశ్వరరావు , కంచర్ల మోహన్ , పులి శ్రీనివాస్ , తట్టకూరి సురేష్ , పాల్గొన్నారు

బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న టిడిపి నేతలు

'యువదళం' సభకు తరలిన తెలుగుయువత

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : యువ దళం బహిరంగ సభకు బాపులపాడు మండలంలోని తెలుగు యువత ఆదివారం బయలుదేరి వెళ్లారు. గన్నవరంలో టిడిపి ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ దళం బహిరంగ సభకు బైక్లతో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. బాపులపాడు మండలం టిడిపి నేతలు దయ్యాల చిన్ను తాటిచెట్టి శ్రీను బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. తెలుగుయువత గ్రామ కమిటీల అధ్యక్షులు చెరుకూరి హరికష్ణ, కుమార్, బాపులపాడు, కొత్తపల్లి, మల్లవల్లి, రేమల్లె, మడిచర్ల, అరుగొలను, వీరవల్లి, రంగన్నగూడెం, వేలేరు తదితర గ్రామాల నుండి బయలుదేరిన బైక్ ర్యాలీని పర్యవేక్షించారు.

ఎంపి బాలశౌరికి మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళగిరి వెళ్లి పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరేందుకు వెళుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని దివిసీమ నుండి జనసేన కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో మంగళగిరి తరలి వెళ్లారు. దివిసీమ లోని మూడు మండలాల నుండి 250 కార్లలో అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు సమక్షంలో కార్యకర్తలు అభిమానులు తరలి వెళ్లారు. వీరంతా పులిగడ్డ వార్పు వద్ద గల టోల్ ప్లాజా వద్ద నుండి తరలి వెళ్లారు. వీరికి పార్టీ నాయకులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల పార్టీ అధ్యక్షులు మర్రి గంగయ్య, నియోజకవర్గ నాయకులు రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావుతో పాటు పలువురు నాయకులు తరలి వెళ్లగా అవనిగడ్డకు చెందిన గాజుల పోతురాజు జనసేన పార్టీలో చేరనున్నట్లు తెలిపారు.**ప్రజాశక్తి-మోపిదేవి :** మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆదివారం జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన మోపిదేవిలో జనసైనికులు సంబరాలు నిర్వహించారు. జనసేన నాయకులు భోగిరెడ్డి సాంబయ్య ఆధ్వర్యంలో మోపిదేవి సెంటర్లో గుడి వద్ద ఆదివారం రాత్రి పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అనంతరం సెంటర్లో మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో అరజా కిరణ కాంత్, ఎర్రం శెట్టి సునీల్, కలపాల ప్రసాద్, కాగితాల సాంబశివరావు, కేశవ, కామిశెట్టి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు దిడ్ల జానకి రాంబాబు, చందన రంగారావు తదితరులు పాల్గొన్నారు

చైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి :ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు మండలంలో శ్రీ చైతన్య స్కూల్‌ని సెలవ దినాల్లో కూడా యధావిధిగా నిర్వహించడాన్ని దానికి మద్దతుగా నిలిచిన ఎంఈఓ అధికారుల మీద ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సమరం డిమాండ్ చేశారు. చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రాణాలతో చెలగాటమాడుతోందన్నారు. ఇదే చైతన్య స్కూల్లో ఒక దళిత వర్గానికి చెందిన ఒక విద్యార్థిని మరణాన్ని కారణమైన ఆ స్కూల్ ప్రిన్సిపల్ మీద ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకొని విద్యాశాఖ అధికారులు ఇప్పుడు ఏకంగా ఆదివారం పూట కూడా యధావిధిగా స్కూల్ నడిపించడానికి పర్మిషన్ ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రాజేష్, జిల్లా నాయకులు సలీం సమీర్ విద్యార్థులు పాల్గొన్నారు

జగన్‌కు ప్రజాకోర్టులో శిక్ష తప్పదు : టిడిపి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చేది గోరంత, ప్రజల నుంచి దోచుకునేది కొండంత అని పలువురు టిడిపి నాయకులు విమర్శించారు. ఆదివారం స్థానిక నియోజక వర్గ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో టిడిపి నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే పథకాలు రద్దు అవుతాయని జగన్ రెడ్డి మోసపు మాటలు చెప్పి ప్రజలను మరోసారి మోసం చేస్తున్నాడన్నారు. ప్రజలు ఎవరు జగన్ మోసపు మాటలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.పేద ప్రజలకు తొలి నుండి సంక్షేమ పథకాలు అందించిన పార్టీ టిడిపి అన్నారు. ఈ సమావేశంలో పార్టీ తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి, కష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ చైర్మన్, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్,నగర కార్పొరేషన్ అధ్యక్ష, కార్యదర్శి, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ళ వెంకట కాంతారావు, కార్పొరేటర్లు, చిత్తజల్లు నాగ రాము, దింటకుర్తి సుధాకర్, దేవరపల్లి అనిత పాల్గొన్నారు.

రఘుశేఖర్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమ ప్రాంతంలో నాగాయలంకకు చెందిన తలసీల రఘుశేఖర్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ కొనియాడారు. ఆదివారం నాగాయలంకలో సుదర్శన్ మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో మండవ సీతారామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన 37వ ఉచిత నేత్ర వైద్య శిబిరంను బుద్ధప్రసాద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల క్రితం ప్రారంభించిన సుదర్శన్ మానవతా సేవా సంస్థ దివిసీమ ప్రాంతంలో దాదాపు 5500 మందికి పైగా నేత్ర శాస్త్ర చికిత్సలు ఉచితంగా చేయడమే కాకుండా మరణించిన వారి వద్ద నుండి 200 జతల కార్నియాలు సేకరించి ఎంతోమందికి కంటిచూపు రావడానికి కారణమైందన్నారు. సుదర్శన మానవతా సేవా సంస్థ నాగాయలంకకు మాత్రమే పరిమితం కాకుండా అవనిగడ్డ నియోజకవర్గ వ్యాప్తంగా తమ సేవలు విస్తరింప చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శీలం అశ్విన్ కుమార్, గ్రామ ఉపసర్పంచ్ తలసిల నాని, నాగాలంక మండల రెడ్ క్రాస్ అధ్యక్షులు బో గాది శివ, విష్ణువర్ధన్, శంకర్ నేత్రా వైద్యాలయం ప్రతినిధి నాగబాబు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

ఈత పోటీల్లో జగ్గయ్యపేట విజయభేరి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన 24వ కృష్ణ రివర్ క్రాస్ 1.5 కి.మీ ఈత పోటీల్లో జగ్గయ్యపేట నుండి అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా భారత క్రికెట్ సంఘం మాజీ అధ్యక్షులు ఎంఎస్‌కె.ప్రసాద్, మాజీ ఎంపి గోకరాజు గంగరాజు పాల్గొని విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రదానం చేశారు. మొదటి బహుమతి 50 గ్రాముల వెండి, ద్వితీయ 30 గ్రా. తృతీయ 20 గ్రాముల వంతున వెండి నాణేలు అందజేశారు. 51-60 సంవత్సరంలో మహిళ విభాగంలో కాస్తాల యేసుమణి ప్రథమ స్థానం, పొట్టాబత్తిన లక్ష్మి ద్వితీయ స్థానం, 61-70 పురుషుల విభాగంలో గంజి మోహన్ బాబు తృతీయ స్థానం సాధించారు. విజేతలను జగ్గయ్యపేట శాసనసభ్యులు ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), కృష్ణా స్విమ్మర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు, ఒంగోలు డి.ఎస్.పి మోటపోతుల కిషోర్ బాబు, డ్రీమర్ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మందడపు శ్రీనివాసరావు, కృష్ణా స్విమ్మర్స్ అధ్యక్షులు పిన్నెల్లి పాండురంగారావు అభినందించారు.

వాక్‌థాన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గమయ చైల్డ్ డెవప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో వాక్ ఫర్ సపోర్ట్ డిఫరెంట్ ఎబిలిటిస్ వాక్‌థాన్ కార్యక్రమం బందర్ రోడ్డు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ వాక్‌ను ఐఎపి సెక్రటరీ శ్రీదేవి జెండా ఊపి ఈ వాక్‌ను ప్రారంభించారు. ఈ వాక్‌లో పెద్ద ఎత్తున సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లల్లో అనేక మానసిక సమస్యల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చిన్న వయసులోనే మానసిక సమస్యలు గుర్తించి వారికి సరైన థెరపీలు అందిస్తే వారు మామూలు పిల్లలూ తయారయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. డాక్టర్ నోరి ఆధ్వర్యంలో ఇప్పుడు అలాంటి సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.

అనంతరం ప్రముఖ పిల్లల వైద్యులు నోరి సూర్యనారాయణ ప్రముఖ ప్రసూతి వైద్యులు నోరి అనురాధ మాట్లాడుతూ గమయ చైల్డ్ డెవల్మెప్మెంట్ సెంటర్‌ను స్థాపించుకుని ఏడాది కాలం పూర్తి అయ్యిందని ఒక మంచి ఉద్దేశంతో ఈ సెంటర్‌ను స్థాపించుకున్నట్లు తెలిపారు. కరోనా తర్వాత పిల్లలలో ఎక్కువగా ఆటిజం, ఎడిహెచ్‌డి హైపర్ యాక్టివిటీ లాంటి అనేక కారణాలు ఎక్కవ అవుతున్నాయని చెప్పారు. మానసిక ఎదుగుదల కోసం గమయ సెంటర్‌లో అన్ని రకాల వసతులు కల్పించామన్నారు. బిహేవియర్ థెరపీ, స్పీచ్ థెరపి, ఫిజియో థెరపీ లాంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సమాజానికి ఉపయోగపడాలనే ఉద్దేశంతోనే ఈ సంస్థ స్థాపిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ సైకాలజిస్ట్ డాక్టర్ మేఘన, చైల్డ్ డెవలప్‌మెంట్ పీడియాట్రిషియన్ డాక్టర్ కీర్తీ, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గయాజుద్దీన్‌కు సత్కారం

ప్రజాశక్తి - భవానీపురం : రానున్న ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం సీటును జనసేనపార్టీ తరపున షేక్ గయాజుద్దీన్‌కు ఇవ్వాలని భవానీపురంలోని హజ్రత్ సయ్యద్ గాలిబ్ షాహిద్ దర్గా ప్రాంత ముస్లిం పెద్దలు జనసేన, టిడిపి నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం దర్గా ప్రాంతంలోని ముస్లిం పెద్దల ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్లిన జనసేన విజయవాడ నగర అధికార ప్రతినిధి, ఐజా గ్రూప్ చైర్మన్ షేక్ గయాసుద్దీన్ (ఐజా) దర్గాలో బాబావారికి చాదర్‌ను సమర్పించిన అనంతరం వారు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ముస్లింల జనసంఖ్య ఎక్కువగా ఉందని, కావున జనసేన నాయకులు గయాసుద్దీన్‌కు పశ్చిమ టిక్కెట్టును ఇవ్వాల్సిన అవసరం ఉందని వారుచెప్పారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు గయాజుద్దీన్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జనసేన టిడిపి అఖండ విజయం సాధించడం ఖాయమని అన్నారు.

నవ్వించడం సులువు కాదు

ఎన్‌ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ రావి వెంకట్రావు

కళాకారుల నృత్యం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మనిషి ఆనందంగా ఉన్నప్పుడే నవ్వగలడు, ఒక వ్యక్తిని ఏడిపించడం చాలా సులభం, కానీ నవ్వించడం తేలికైన విషయం కాదు అని ఎన్‌ఆర్ఐ ఇన్సిస్టూట్ ఆఫ్ టెక్నాలజీ చైర్మన్ డాక్టర్ రావి వెంకట్రావు అన్నారు. ఆదివారం సాయంత్రం 'సుమధుర కళా నికేతన్' 50వ వార్షికోత్సవం, 26వ తెలుగు హాస్య నాటికల పోటీలు ముగింపు సమావేశం ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళా పీఠం, పిబి.సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన రావి వెంకట్రావు మాట్లాడుతూ నాలుగు రోజుల నవ్వుల పండుగలా హాస్యనాటికలను ప్రదర్శింప చేస్తున్న సుమధుర కళా నికేతన్ సేవలు ప్రశంసనీయమన్నారు. సిద్ధార్థ కళా పీఠం బాధ్యులు లక్ష్మణ్ శుభాకాంక్షలు తెలిపారు. సుమధుర గౌరవాధ్యక్షులు ఎంసి.దాస్ మాట్లాడుతూ పెడదోవ పడుతున్న యువతను ఈ కళలను నేర్పించడం ద్వారా క్రమశిక్షణ నేర్పవచ్చున్నారు. న్యాయవాది ధారా సత్యనారాయణ మాట్లాడుతూ కళల ద్వారా ప్రజల్ని చైతన్య పరిచి మంచి మార్గాన పయనింపచేయాలన్నారు. జంధ్యాల స్మారక పురస్కారం, ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయిమాధవ్‌కు అందించి ఘన సత్కారం చేశారు. ప్రముఖ సినీ హీరోల చిత్రాలకు సంభాషణలు అందించి చిత్రవిజయానికి కారకులు సాయి మాదవ్ అని వక్తలు ప్రశంసించారు. పురస్కార గ్రహీత సాయి మాధవ్ ప్రతి స్పందిస్తూ హాస్యబ్రహ్మ జంధ్యాల పురస్కారం అందుకోవడం అదృష్టం అన్నారు. నాటక రచనే తనకు తృప్తినిస్తుంది అన్నారు. సభ ప్రారంభానికి ముందు మహిళ చైతన్యవంతురాలు కావాలని ప్రభోదిస్తూ ఎస్‌డిఎం సిద్ధార్థ కళాశాల విద్యార్థినులు 'ఇంకానా' నాటిక వాసు దర్శకత్వంలో, నారాయణబాబు రచన ప్రదర్శించారు. అనంతరం బి సిటుడియో, హైదరాబాదు వారి 'న్యూ బాంబే టైలర్స్' ప్రదర్శించారు. ఈ నాటిక రచన ఖదీర్ బాబు, దర్శకులు జాన్ బషీర్ సభాధ్యక్షులు సామంతపూడి నరసరాజు ప్రసంగిస్తూ 50 సంవత్సరాలుగా నిరంతరాయంగా కళల అభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత సుమధురదే అన్నారు. సుమధుర సీనియర్ సభ్యులు టివిఎస్ ఆంజనేయ రాజు మాట్లాడుతూ పేద కళాకారులకు, పిల్లల విద్యకు సహకరిస్తాము అన్నారు. కార్యదర్శి పి.వి.భాస్కర శర్మ, డి.కైలాసరావు పర్యవేక్షించారు. ఉదయం జరిగిన యువజనోత్సవ సంబరాల్లో బాగంగా ప్రముఖ యువ గాయని భమిడిపాటి శ్రీ లలిత మధుర మధుర మీనాక్షి, భరత వేదమున పాటలను వినిపించారు. కీర్తనా శ్రీనివాస్, ప్రణీత, బి.రాజశేఖర్, మల్లిక్ మనోరంజకంగా గానం చేశారు. లేఖ్యాభరణి బృందం, శృతి సమన్వి, సాయి వర్షిత వర్మ, సింగారమణి అజయ్, వాసు, సంస్కార భారతి బృందాల నృత్యప్రదర్శనలు అలరించాయి. ముత్యాల చెరీ స్వరూప్, చెకిత్ ప్రణయ్, వైష్ణవి వాయిద్య విన్యాసం అబ్బురపరిచింది. పిండి ప్రోలు కృష్ణ కుమారి బృందం వాయిద్య విన్యాసం, గానం ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకున్నాయి. పసుమర్తి శివరామ్ కుమార్ చిన్నారులను ఉత్సాహపరుస్తూ వ్యాఖ్యానం అందించారు.

కేన్సర్ బాధితుల కోసం వినూత్న కార్యక్రమం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : కేన్సర్‌తో బాధపడుతున్న వారికి మనో ధైర్యాన్ని నింపి వారికున్న వ్యాధిని త్వరగా నయం చేసేలా ప్రేరణ కల్పించేలా హెచ్‌సిజి క్యాన్సర్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పివిపి మాల్‌లో ద పవర్ ఆఫ్ గుడ్ విషెష్ పేరుతో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.ఎస్.యన్.రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ప్రేమతో కూడిన మాటలు మనోధైర్యాన్ని నింపి వ్యాధి త్వరగా నయమయ్యేలా చేస్తాయన్నారు. కేన్సర్ చికిత్సా వైద్య నిపుణులు డాక్టర్ కె.రంగనాథ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 2022లో 14 లక్షలకు పైగా కొత్త కేసులు వెలుగు చూసినట్లు తెలిపారు. ఆ కారణంగా 9 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కేన్సర్‌పై అవగాహన కల్పించడం ద్వారా మరణాల రేటును గణనీయంగా తగ్గించడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ ఎం.గోపీచంద్, హెచ్‌సిజి కేన్సర్ సెంటర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తెర్లి యువ కిషోర్, జోనల్ హెడ్ కె.రవి కిరణ్ రెడ్డి, రెడ్ ఎఫ్‌ఎం స్టేషన్ హెడ్ క్రాంతి కుమార్, ప్రోగ్రామింగ్ హెడ్ ఆదిల్ భాష పాల్గొన్నారు.

పాలకవర్గ అనుమతితోనే కొత్త బ్రాంచీలు ఏర్పాటు

బ్యాంకు చైర్మన్ వేమూరి వెంకట్రావు

మాట్లాడుతున్న వెంకట్రావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో ఎలాంటి అవకతవకలు జరగలేదని, పాలకవర్గ అనుమతితోనే కొత్త బ్రాంచీల ఏర్పాటుకు సన్నాహాలు చేశామని బ్యాంకు చైర్మన్ వేమూరి వెంకట్రావు తెలిపారు. సభ్యుల డిపాజిట్లు సురక్షితంగా ఉన్నాయని, గాంధీ బ్యాంకుపై అసత్య ప్రచారం నమ్మొద్దని కోరారు. 2021 సంవత్సరంలో తాను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటికి బ్యాంకు నికర లాభం అయిదు కోట్లు ఉండగా, 2022, 2023 నాటికి పన్నెండు కోట్లు అయిందన్నారు. విజయవాడ మ్యూజియం రోడ్లోని గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు కార్యాలయంలో బ్యాంకు చైర్మన్ వేమూరి వెంకట్రావు, సిఇఒ శివప్రసాద్ విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ పాలకవర్గానికి సెప్టెంబరు 2022లో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన డైరెక్టర్లలో ఇద్దరు డైరెక్టర్లు చైర్మన్, సిఇఒ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కో-ఆపరేటివ్ డిపార్టుమెంటుకి ఫిర్యాదు చేశారన్నారు. వారితో పాటు నలుగురు బ్యాంకు సభ్యులతో అదే ఫిర్యాదు పెట్టించారన్నారు. బ్యాంకు వారి విచారణలో ఒక సభ్యుడు 2020 మే నెలలో మరణించారని, ఇద్దరు సభ్యులు తాము ఫిర్యాదు చేయలేదని లిఖిత పూర్వకంగా తెలియజేశారని చెప్పారు. విశాఖపట్నం న్యూ గాజువాకలో కొత్త బ్రాంచి పెట్టేందుకు నలుగురు సీనియర్ డైరెక్టర్లు పరిశీలించి అక్కడ పెట్టేందుకు ప్రతిపాదించగా పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. ఈ నూతన శాఖ ఏర్పాటుకు 33 లక్షలు ఖర్చు పెట్టేందుకు బోర్డు వారు తీర్మానిస్తే 28 లక్షల రూపాయలు ఖర్చుయిందన్నారు.

39వ డివిజన్‌లో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 39వ డివిజలో స్థానిక కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి షేక్ ఆసీఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆదివారం ప్రతి గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసీఫ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. వారి దీవెనలతో పశ్చిమంలో తన గెలుపుకు మార్గం అవుతుందన్నారు. డివిజన్‌లో సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి షేక్ అసిఫ్‌తో పాటు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు పడిగపాటి చైతన్య రెడ్డి, మైలవరపు దుర్గారావు, జిఎంసి బాషా, స్థానిక నాయకులు డి.వి.రెడ్డి పి.సుబ్బారెడ్డి, ఏలూరు వెంకన్న, సాయి బాబుజంగం, సచివాలయ కన్వీనర్లు, గహసారధులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సామినేని

నూతన బ్రిడ్జికి శంకుస్థాపన

ప్రజాశక్తి - వత్సవాయి : దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.26 వేల కోట్ల విలువైన భూమిని 31 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు ఇళ్ల స్థలాల కింద ప్రభుత్వం పంపిణి చేసిందని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. వత్సవాయి మండలంలోని, గోపినేనిపాలెం గ్రామంలో పేదలందరికీ నవరత్నాల్లో ఇల్లు కార్యక్రమంలో భాగంగా గోపినేనిపాలెం గ్రామంలో అర్హులైన 204 మంది లబ్దిదారులకు ఇళ్ళ పట్టాలను రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గోపినేనిపాలెం గ్రామంలో జగనన్న నవరత్నాలు పథకం కింద 204 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్నారు. గోపినేనిపాలెంలో సుందరయ్య కాలనీలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. గ్రామ పార్టీ అధ్యక్షులు కామినేని రాంబాబు, జడ్పిటిసి ఏసుపోగు దేవమణి శ్రీనివాసరావు, ఎంపీపీ కోలుసు రమాదేవి, గ్రామ సర్పంచి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏషియా ఎయిర్ సేవల విస్తరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎయిర్ ఏషియా వినియోగదారుల కోసం సేవలను విస్తరించ నుందని ఇందులో భాగంగానే విశాఖ నుండి కౌలాలంపూర్‌కు విమాన సర్వీసులను అంది స్తుందని సంస్థ ప్రతినిధిరాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్న ఏయిర్ ఏషియా ఎప్పటి కపుడు నెట్‌వర్క్‌ను విస్తరిస్తుందన్నారు. విశాఖ నుండి డైరెక్టుగా విమాన సర్వీసులను కౌలా లంపూర్‌కు అందిస్తుందని వినియోగ దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుర్గమ్మ దర్శనానికి తరలివచ్చిన యాత్రికులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనానికి ఆదివారం సందర్భంగా యాత్రికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యాత్రికుల రద్దీ దృష్ట్యా ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న చిత్ర నటులు

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవ స్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను ఆదివారం చిత్ర నటులు (కథా నాయకులు) కిరణ్ అబ్బ వరం, రక్షిత్ దర్శనార్థం విచ్చేయగా వీరికి ఆల య అధికారులు స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదం అందజేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.